విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

మంగళవారం 10 సెప్టెంబరు 2024 8 పేజీలు

తగ్గని వరద!

- ప్రధాన రోడ్లపై ఉధృతంగా బుడమేరు నీళ్లు
- విజయవాడ నగరంతో రూరల్ గ్రామాలకు రాకపోకలు బంద్
- ప్రయాణ చార్జీలకు రోజుకు రూ.300 నుంచి రూ.500పైనే ఖర్చు
- ఆర్టీసీ బస్సుల రాకపోకల పునరుద్ధరించాలని ప్రజల వినతి

విశాలాంధ్ర - విజయవాడ (వన్‌టౌన్) : బుడమేరు వరదల కారణంగా ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ మండలంలోని పలు గ్రామాలకు గత పది రోజులుగా రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. పలు గ్రామాల నుంచి విజయవాడ నగరానికి వెళ్లలేని పరిస్థితి నెలకొంది. బుడమేరు వరద స్వల్పంగా తగ్గినప్పటికీ, ప్రధాన రోడ్లపై రాకపోకలు ఇంకా పునరుద్ధరించలేదు. విజయవాడ రూరల్ మండలంలోని నున్న, పాతపాడు, కుందావారి కండ్రిక, పీ నైనవరం, అంబాపురం, జక్కంపూడి, కొత్తూరు తాడేపల్లి తదితర గ్రామాలలో వరి పొలాలు, రోడ్లు పెద్దఎత్తున ముంపునకు గురయ్యాయి. కానీ, ప్రభుత్వం మాత్రం ఈ ప్రాంతాల ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం గమనార్హం. విజయవాడ నగరంలోని లోతట్టు ప్రాంతాలలో మిగతా 2 లో ...

కార్మికుల కోసం సీపీఐ పోరాటం

-సీపీఐ శత జయంతి వార్షికోత్సవాలను జయప్రదం చేయండి

-పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతి వరప్రసాద్

విశాలాంధ్ర-చిలకలూరిపేట: దేశంలో బలహీన వర్గాల, కార్మిక కర్షక హక్కుల కోసం నిరంతరం శ్రమిస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అని పల్నాడు జిల్లా పార్టీ కార్యదర్శి ఎ మారుతి వరప్రసాద్ చెప్పారు. భారత కమ్యూనిస్టు పార్టీ శతజయంతి వార్షికోత్సవాల సందర్భంగా చిలకలూరిపేట మండలం వేలూరు గ్రామంలో సీపీఐ జెండాను మారుతి వరప్రసాద్ సోమవారం సాయంత్రం ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్మారక స్థూపం వద్ద, అమరజీవి కామ్రేడ్ బొంతా దానియేలు సమాధి వద్ద చిలకలూరిపేట నియోజకవర్గ ఇన్చార్జి కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ పూలమాలను వేసి అమరవీరులకు ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా అధ్యక్షులు తాళ్లూరి బాబురావు అధ్యక్షతన జరిగిన బహిరంగ సభలో పార్టీ జిల్లా, నియోజకవర్గ నాయకులు పాల్గొని మాట్లాడారు. బహిరంగ సభకు ముందుగా ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సీనియర్ కళాకారులు బొంతా అయమ్మరావు విప్లవ గేయాలు ఆలపించారు. సభలో మారుతి వరప్రసాద్ మాట్లాడుతూ మనదేశంలో 1925వ సంవత్సరంలో ఆవిర్భవించిన భారత కమ్యూనిస్టు పార్టీ నాటి స్వతంత్ర ఉద్యమ పోరాటం నుంచి అనేక ప్రజా రైతాంగ సాయుధ పోరాటాలను, ఉద్యమాలను ముందుండి నడిపించడమే కాకుండా ఈ 2024 డిసెంబర్ 26వ తేదీ నాటికి పార్టీ వంద సంవత్సరాలు పూర్తి చేసుకోవడం జరుగుతుందని తెలిపారు. సీపీఐ నిర్వహించిన అనేక ప్రజా పోరాటాలలో ఎంతోమంది అమరవీరులు తమ ప్రాణాలను ప్రజల కోసం అర్పించారని మిగతా 2 లో ...

రేపు కృష్ణాకు కేంద్ర బృందం

రూట్ మ్యాప్ సిద్ధం చేయాలని కలెక్టర్ ఆదేశం

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : ఈ నెల 11వ తేదీన కేంద్ర బృందం జిల్లాకు వస్తున్న దృష్ట్యా రూట్‌మ్యాప్ సిద్ధం చేయాలని అధికారులను కలెక్టర్ డీకె. బాలాజీ ఆదేశించారు. నగరంలోని కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ కేంద్ర బృందం పర్యటన ఏర్పాట్లపై సోమవారం అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మిగతా 2 లో ...

కమ్యూనిస్టు పార్టీలు ప్రజాసేవకే అంకితం 4 లో ...

ముంపు ప్రాంతాల్లో మంత్రుల పర్యటన 3 లో ...

వెంకటేశ్వరస్వామి గుడిలో చోరీ.. 5 లో ...

సీసపు గని పునః ప్రారంభించాలి 8 లో ...

ప్రభుత్వ ధరలే వసూలు

గుంటూరు జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జిల్లాలో ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఇసుకను తరలించే రవాణా వాహనదారులు ప్రభుత్వం నిర్దేశించిన ధరలను మాత్రమే వినియోగదారుల నుంచి వసూలు చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి ఇసుక రవాణా చేసే వాహనాలకు రాష్ట్ర మైనింగ్ శాఖ నిర్ణయించిన ధరలపై మైనింగ్, రవాణా శాఖ, జిల్లాలోని ఇసుక రవాణా చేసే వాహనదారులతో సోమవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మిగతా 2 లో ...

జీవితాంతం ప్రజా సేవలోనే

సుంకర, వాసిరెడ్డి, నార్ల చిరంజీవిల సంస్మరణలో వక్తలు

విశాలాంధ్ర-తెనాలి : తెలుగునాట సమస్త కళా ప్రక్రియలకు సామాజిక పరిస్థితులను జోడించి సరికొత్త సాంస్కృతిక విలువలకు ప్రజా జీవన సంఘర్షణల వాస్తవిక చిత్రణకు రూపకల్పన చేసిన ప్రజాకవులు సుంకర సత్యనారాయణ, వాసిరెడ్డి భాస్కరరావు, నార్ల చిరంజీవి ప్రజల హృదయాలలో చిరస్థాయిగా నిలిచిపోయారని వక్తలు పేర్కొన్నారు. తెనాలి గాంధీనగర్ ఇస్కఫ్ మీటింగ్ హాలులో సోమవారం ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్య మండలి, అభ్యుదయ కళాసమితి సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అమర కళాకారుల సంస్మరణ సభ మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

రేపు కృష్ణాకు కేంద్ర బృందం

మాట్లాడుతూ ఈ నెల 11వ తేదీన కేంద్ర అంతర్‌మంత్రిత్వ కమిటీ బృందం జిల్లాలో వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించి దెబ్బతిన్న వివిధ రకాల పంటలు, ఆక్వా కల్చర్, రహదారులు, వంతెనలు పరిశీలించడా నికి వీలుగా రూట్ మ్యాప్ తయారు చేయాలన్నారు. దెబ్బతిన్న పంటలు, రహదారులు, వంతెనలకు సంబందించి వివరించేందుకు పవర్ పాయింట్ ప్రజంటేషన్, చాయాచిత్ర ప్రదర్శన ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీఆర్ఓ కె. చంద్రశేఖరరావు, కె ఆర్ ఆర్ సి ఎస్ డి సి జి. శ్రీదేవి, జిల్లా పశు సంవర్ధక, మత్స్య శాఖ అధికారులు శ్రీనివాసరావు, చంద్రశేఖర్, ఏపి ఎంఐపి పిడి జి. విజయలక్ష్మి, డిఐసి జిఎం వెంకట్రావు, ఆర్డబ్ల్యూఎస్ ఈఈ శివప్రసాద్, సిపిఓ గణేష్, వ్యవసాయ శాఖ డిడి. మనోహర్, ఏడి మణిధర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ ధరలే వసూలు

ప్రభుత్వం వినియోగదారులకు ఉచితంగా అందించే ఇసుకను రవాణా చేసేందుకు రాష్ట్ర వ్యాప్తంగా వాహనదారులు కి.మీ ఒకే ధరను వసూలు చేసేందుకు రాష్ట్ర మైనింగ్ శాఖ ధరలు నిర్ణయించదని, దీనిని అమలు చేసేందుకు జిల్లాలో ఇసుక రవాణా చేసే వాహనదారులతో సమావేశం ఏర్పాటు చేసి అభిప్రాయాలు తీసుకోవటం జరుగుతుందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ట్రాక్టరు, ఆరు, పది టైర్ల లారీకి కి.మీ వారీగా టన్నుకు వసూలు చేసేందుకు నిర్ణయించిన ధరల వివరాలను జిల్లా కలెక్టర్ సమావేశంలో తెలిపారు. దీనిపై ఇసుక రవాణా చేసే వాహనదారులు అభిప్రాయాలు వ్యక్తం చేస్తూ అయిల్, నిర్వహణ చార్జీలు, డ్రైవర్, ఇతర ఖర్చులు దృష్టిలో ఉంచుకొని ఇసుక రవాణా చేసే వాహనాలకు ట్రాక్టరుకు(4.5 ఎం.టీ), ఆరు టైర్ల లారీ(10 ఎం.టీ), పది టైర్ల లారీ(18 ఎం.టీ)లకు కిలో మీటరుకు రూ.200 చొప్పున ఇస్తేనే గిట్టుబాటు అవుతుందని తెలిపారు. వాహనదారులు తెలిపిన అభిప్రాయాలను రాష్ట్ర మైనింగ్ శాఖ అధికారులకు తెలియచేస్తామని కలెక్టర్ తెలిపారు. అదేవిధంగా ఇసుక రవాణా చేసే వాహనదారులు తెలిపిన ఇతర అంశాలైన స్టాక్ యార్డుల వద్ద క్యూలైన్లు సక్రమంగా నిర్వహించటం, వాహనాలు మైనింగ్ శాఖ రిజిస్ట్రేషన్, నగరాల్లోని పగటి వేళ ఇసుక వాహనాల అనుమతి, వినియోగదారులతో ఇసుక అన్ లోడింగ్ సమయంలో పేమెంట్‌కు ఇబ్బంది లేకుండా ఆన్‌లైన్‌లోనే నగదు చెల్లింపులు తదితర అంశాలను అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హామీ ఇచ్చారు. సమావేశంలో జిల్లా మైనింగ్ శాఖ డీడీ చంద్రశేఖర్, ఆర్డీవో గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

జీవితాంతం ప్రజా సేవలోనే

రెండువరోజు కొనసాగింది. సభకు సి.సి స్మారక సమితి అధ్యక్షులు చందు సూర్య అధ్యక్షత వహించి మాట్లాడుతూ సుంకర సత్యనారాయణ పేదరికంలో వుండి కూడా కమ్యూనిస్టు పార్టీ, ప్రజానాట్యమండలి కార్యక్రమాల్లో జీవితాంతం పాల్గొని ప్రజా సేవలొనరించిన ప్రముఖులు అన్నారు. అభ్యుదయ రచయితల ఉత్యమంలో కూడా పూర్తి కాలం పనిచేశారని, సుంకర, వాసిరెడ్డి భాస్కరరావులు రాసిన మా భూమి, ముందడుగు నాటకాలు వేల ప్రదర్శనలకు నోచుకుని ప్రజలను చైతన్యపరిచాయన్నారు. సుంకర కష్టజీవి బుర్రకథ ద్వారా లక్షలాది ప్రజల్లో మార్పు తీసుకొచ్చారన్నారు. ప్రజల్లో కలసిమెలసి పనిచేసి వారి స్థితిగతుల మెరుగు కోసం నిరంతరం కృషి చేశారన్నారు. స్టాలిన్ గ్రాడ్ బుర్రకథ రాసి అందులో శ్యాల్యూట్ ఎర్ర సైనికా గేయం ప్రజలను ఉత్తేజపరిచేదన్నారు. ఉపాధ్యాయ అవార్డు గ్రహీత యం.వి. రఘునాధరావు మాట్లాడుతూ సుంకర వాసిరెడ్డి పల్లెటూరు, పుట్టిల్లు తదితర సినిమాలు శత దినోత్సవాలు చేయించుకున్నాయన్నారు. ఏది నిజం, నమ్మినబంటు చిత్రాలకు రాష్ట్రపతి అవార్డులు వచ్చాయన్నారు. వాసిరెడ్డి భాస్కరరావును గురించి మాట్లాడుతూ సుంకరకు తోడుగా వాసిరెడ్డి కలసి రచనలు చేసి సుంకర, వాసిరెడ్డిగా ప్రసిద్ధి పొందారన్నారు.

తెలుగు నాడును ఉర్రూతలూగించిన ముందడుగు, మా భూమి, అపనింద నాటకాలు కలసిరాసి చరిత్రను సృష్టించిన వారి జీవితం వ్యక్తిత్వం త్యాగాలను నేటి తరం స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. భాస్కరరావు తన యావత్ ఆస్థిని ప్రజలకర్పించారన్నారు. నటుడు, గాయకుడు విజయసారధి నార్ల చిరంజీవిని గురించి మాట్లాడుతూ ఆంధ్రసాహిత్యాన్ని సుసంపన్నం చేసేందుకు సాహిత్య క్షేత్రాన్ని సస్యశ్యామలం చేసిన హావికుల్లో నార్ల చిరంజీవి ఒకరు అన్నారు. పలు ప్రక్రియల్లో రచనలు చేశారన్నారు. ఈయన బాలల కోసం జాబిల్లి పాటలకు స్రష్ట అన్నారు. భాగ్యనగరం నాటకం నేటికి ప్రజలు గుర్తుంచుకున్నారని చెప్పారు. సినీపాటల రచయితగా పనిచేశారు. ఆరాధన, ఎత్తుకు పైఎత్తు, లక్షాధికారి, అప్పగింతలు తదితర 20 సినిమాలకు పాటలు రాశారు. మాటలు కూడా కొన్ని చిత్రాలకు రాశారు. స్వలాభాపేక్షకు తావియ్యక కమ్యూనిజ గమ్యానికి నిరంతరం కృషి చేసిన నార్ల చిరంజీవి చిరస్మరణీయులన్నారు. సభా ప్రారంభంలో సుంకర, వాసిరెడ్డి, నార్ల చిరంజీవిల చిత్రపటాలకు పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సభలో బొల్లిముంత కృష్ణ, అద్దంకి రత్తయ్య తదితరలు మాట్లాడారు. ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గాయకులు నీలాంబ్రం, సూర్య, సిహెచ్. వీణ తదితరులు విప్లవగీతాలు గానం చేశారు.

కార్మికుల కోసం సీపీఐ పోరాటం

జరిగిందని అన్నారు. 1954వ సంవత్సరం కాలంలో జరిగిన తెలంగాణ సాయుధ పోరాటంలో, శ్రీకాకుళ గిరిజన ఉద్యమంలో కమ్యూనిస్టు పార్టీపై నిషేధం ఉన్న నేపథ్యంలో వేలూరు గ్రామానికి చెందిన ఆళ్ల వెంకయ్య, గడ్డం మోషే, కట్టా దామోదరం, కాకాని రామచంద్రయ్య తదితరులు ఆరుగురు పార్టీ నాయకులను అప్పటి ప్రభుత్వం కాల్చి చంపడం జరిగిందని అన్నారు. ఆరుగురు అమరవీరులను ఈ దేశానికి అందించిన ఘనమైన చరిత్ర వేలూరు గ్రామానికి ఉందని అన్నారు. చిలకలూరిపేట నియోజకవర్గ మొట్టమొదటి శాసనసభ్యులు కామ్రేడ్ కరణం రంగారావు, కరణం నర్సింగరావు, బొర్రా వెంకటసుబ్బయ్య, పఠాన్ దరియా ఖాన్, చౌటపల్లి అంకయ్య, జంపని వెంకటేశ్వర్లు, బొంతా దానియేలు గ్రామంలో పార్టీ ఆవిర్భావానికి ఎంతో కృషి చేయడం జరిగిందని తెలిపారు. ఆనాడు వేలూరు గ్రామానికి చెందిన అనేకమంది పార్టీ నాయకులను పార్టీ సభ్యులను అప్పటి ప్రభుత్వాలు అరెస్టులు చేసి చిత్రహింసలకు గురి చేయడం జరిగిందని తెలిపారు. అయినా గ్రామంలో ఎన్నికల ప్రక్రియ ప్రారంభం అయినప్పటి నుంచి నేటి వరకు అరుణ పతాకాన్ని మొక్కవోని ధైర్యంతో అరెపరెపలాడిస్తున్న రెడ్ విలేజ్ వేలూరు గ్రామమేనని ఆయన కొనియాడారు. సీపీఐ పల్నాడు జిల్లా సహాయ కార్యదర్శి కాసా రాంబాబు మాట్లాడుతూ భవిష్యత్తులో జరగనున్న ప్రజా పోరాటాలు ఉద్యమాలలో యువత విద్యార్థులు కార్మికులు కర్షకులు అగ్ర భాగాన నిలబడి ప్రజల కోసం పనిచేయాలని పిలుపునిచ్చారు. ప్రముఖ న్యాయవాది, సీపీఐ నాయకులు రావిపాటి వెంకటేశ్వరరావు (ఆర్‌వీ) మాట్లాడుతూ ఎన్ని రాజకీయ పార్టీలు వచ్చిన పేదల పక్షాన పోరాడేది మాత్రం సీపీఐ అన్నారు. ఎన్నికలలో గెలుపోటములను బేరీజు వేసుకోకుండా గెలిచినా ఓడిన సామాన్యుల సమస్యల కోసం సమరశీల పోరాటాలు నిర్వహించే పార్టీ సీపీఐ మాత్రమే అని గుర్తు చేశారు. యువత, విద్యార్థులు, మహిళలు, కార్మికులు, భారత కమ్యూనిస్టు పార్టీలోకి వచ్చి భవిష్యత్తులో నిర్వహించే ప్రజా పోరాటాలకు వెన్నుదన్నుగా నిలవాలని తెలిపారు. సభానంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో వినుకొండ నియోజకవర్గ పార్టీ కార్యదర్శి బూదాల శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు పేలురి రామారావు, ఏఐవైఎఫ్ జిల్లా ఇన్‌చార్జి షేక్ సుభాని, నాయకులు ఆరాధ్యుల రామకృష్ణ, తన్నీరు వెంకటేశ్వర్లు, మూసాబోయిన వెంకటేశ్వర్లు, మహిళా సమాఖ్య నాయకురాలు సుబ్బాయమ్మ, వేలూరు గ్రామ సిపిఐ కార్యదర్శి కందిమళ్ల వెంకటేశ్వర్లు, నియోజకవర్గ కార్యవర్గ సభ్యులు సురభి రాజు, గ్రామపంచాయతీ సర్పంచ్ బొంతా తిరుపతయ్య, ఎంపరాల సత్యం, తంగిరాల జీవరత్నం, వంజా పౌలు, ఏలికా శ్రీను, బొంతా రాజారావు, బొంతా శేషయ్య, షేక్ నన్నే, షేక్ ఇబ్రహీం, వాసిమళ్ళ దేవరాజు, వంజా భగత్, తాపీ వర్కర్స్ యూనియన్ నాయకులు సురభి గుండమ్మ, బొంతా దేవరాజు, బొంతా కోటేశ్వరరావు, ముఠా వర్కర్స్ యూనియన్ నాయకులు రాంకూరి ఆదాం, బొంతా చైతన్య, చౌటపల్లి శ్రీను, బొంతా రవికుమార్, వేలూరు గ్రామ ఏఐవైఎఫ్ యూత్ నాయకులు బొంతా మధు, బొంతా నాగరాజు, సురభి అశోక్, ఈపూరి నాని, బొంతా ఇమ్మానుయేలు , బొంతా మోషే, బొంతా సన్నీ, వేలూరు గ్రామ లెనిన్ యూనిట్ కార్యదర్శి బొంతా భగత్ సింగ్, వేలూరు గ్రామ పార్టీనాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.

తరగని వరద!

వరద ముంపు నివారణపై మాత్రమే ప్రభుత్వం దృష్టి సారించిందని, తమ ప్రాంతాలను నిర్లక్ష్యం చేస్తోందని స్థానికులు విమర్శిస్తున్నారు. విజయవాడను చుట్టుపక్కల గ్రామాలతో కలిపే ప్రధాన మార్గాల నుండి వరదనీటిని తొలగించడంలో పెద్దగా శ్రద్ధ చూపలేదు. పర్యవసానంగా, నూజివీడు - విజయవాడ, విస్సన్నపేట - విజయవాడలను కలిపే మార్గాల్లోని గ్రామాలతో పాటు ఆగిరిపల్లి నుండి గన్నవరం మీదుగా విజయవాడ రాకపోకలు పూర్తిస్థాయిలో నిలిచిపోయాయి. దీంతో ప్రజలు విజయవాడకు వెళ్లి తిరిగి రావడానికి అనేక ఇబ్బందులు పడుతున్నారు. విజయవాడకు వెళ్లి తిరిగి వచ్చే సరికి ప్రయాణ ఖర్చులకు రోజుకు రూ.300 నుంచి రూ.500 వరకు ఖర్చు చేస్తున్నామని ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు వాపోతున్నారు. ప్రధాన రోడ్లపై బుడమేరు వరద ప్రవాహం ప్రమాదస్థాయిలో ఉండటంతో, వీరంతా గన్నవరం మీదగా విజయవాడ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో రానూ పోనూ కేవలం 20 కిలోమీటర్ల దూరానికి తాము 80 కిలోమీటర్లమేర ప్రయాణం చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. ప్రధానంగా రోజువారీ కార్మికులు తమ వేతనం రూ.700లలో సగానికిపైగా ప్రయాణానికి ఖర్చు చేయాల్సి వస్తోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బుడమేరు వరద నీరు ప్రధాన రహదారులపై ప్రవహిస్తుండగా, ట్రాక్టర్లు, జీపులు, పెద్ద వ్యాన్లు సులభంగా వెళుతున్నాయి. కొన్ని ఆటోలు కూడా రాకపోకలు సాగిస్తుండగా, వారు పెద్ద మొత్తంలో చార్జీలు వసూలు చేస్తున్నారని పలు గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రధాన రూట్లలో ఆర్టీసీ బస్సులను నడపాలని వారు అధికారులను కోరారు. విజయవాడలోని ఆటో నగర్ తదితర ప్రాంతాల్లో పని చేస్తున్న దినసరి కూలీలకు బస్సు సర్వీసులు ఉపయోగకరంగా ఉంటాయి. మరోవైపు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పలు ప్రైవేట్ విద్యాసంస్థలు సోమ వారం నుంచి తరగతులు ప్రారంభించాయి. అయితే ఈ ప్రాంతాల నుంచి చాలా మంది విద్యార్థులు కళాశాలకు వెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గం లేదు. కాబట్టి, గ్రామీణ ప్రాంత ప్రజల ప్రయాణ సమస్యలను పరిష్కరించడానికి ఆర్టీసీ బస్సులను నడపడమే ఏకైక పరిష్కారమని వారు తెలిపారు.

ఏడీసీపీగా శ్రీనివాసరావు బాధ్యతలు స్వీకరణ

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): విజయవాడ ఏడీసీపీగా శ్రీనివాస్‌రావు బాధ్యతలు స్వీకరించారు. సోమవారం విజయవాడ పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలశారు. గుంటూరు క్రైమ్ అడిషనల్ ఎస్పీగా ఉన్న ఆయన ఎన్టీఆర్ జిల్లా టాస్క్‌ఫోర్స్ ఏడీసీపీగా సాధారణ బదిలీ అయ్యారు. టాస్క్‌ఫోర్స్ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు.

ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 19 ఫిర్యాదులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో 19 ఫిర్యాదులు అందాయి. ఎన్టీఆర్‌జిల్లా సీపీ ఎస్వీ.రాజశేఖరబాబు ఆదేశాల మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను ట్రాఫిక్ డీసీపీ ఎం.కృష్ణమూర్తినాయుడు బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అందిన ఫిర్యాదుల్లో నగదు లావాదేవిలు 5. భార్యభర్తలు, కుటుంబ కలహాలు 3, భూవివాదాలు 2, వివిధ మోసాలకు సంబంధించి 3, ఇతర సమస్యలు 6 ఇలా 19 ఫిర్యాదలు అందాయి. దీనిపై సంబంధిత ఎస్‌హెచ్‌వోలకు చట్టపరిధిలో సమస్యలను పరిష్కారించాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వరద బాధితులకు సహాయ సహకారాలు అందించడంలో రాష్ట్ర ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావలసిన అవసరం ఉందని సీనియర్ ఐఏఎస్ అధికారి వ్యవసాయ సాధికారిక సంస్థ సీఈఓ బి. రామారావు , రిటైర్డ్ ఐపీఎస్ అధికారి ఎం రవీంద్రనాథ్ బాబులు పిలుపునిచ్చారు . న్యూస్ (నాయి బ్రాహ్మణ ఎంప్లాయిస్ వెల్ఫేర్ సర్వీసెస్) ఆధ్వర్యంలో ఆదివారం ఉదయం అయోధ్య నగర్ లోని నాయి బ్రాహ్మణ కమ్యూనిటీ హాల్లో జరిగిన కార్యక్రమంలో దాదాపు రెండు లక్షల రూపాయలు విలువైన నిత్యవసర సరుకులను సింగ్ నగర్ ప్రాంతానికి చెందిన వరద బాధితులకు అందించారు . నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు మల్కాపురం కనకారావు , అన్నవరపు బ్రహ్మయ్యలు మాట్లాడుతూ బుడమేరు వరదల కారణంగా సర్వం కోల్పోయిన ప్రజలను చూస్తుంటే హృదయ విదారకంగా ఉందని వారు వ్యాఖ్యానించారు .ఐదు కిలోల బియ్యం, వంట నూనె ప్యాకెట్ , ఉల్లిపాయలు చింతపండు కందిపప్పు వంటి సరుకులతో కూడిన కిట్టులను బాధితులకు అందించారు . ఈ కార్యక్రమంలో నాయి బ్రాహ్మణ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు పివి రమణయ్య , ఏసీబీ సర్కిల్ ఇన్స్పెక్టర్ ఎం నాగరాజు , నాయి బ్రాహ్మణ సంక్షేమ సంఘ నాయకులు కొమ్మవరపు భాను ప్రసాద్ , కనుపర్తి జానకిరామ్ , న్యూస్ సంస్థ కోశాధికారి గుంటుపల్లి ఉమామహేశ్వరరావు , కమ్యూనిటీ హాల్ నాయకులు కే నాగేంద్రరావు ,ఎం నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో బాధ్యతారాహిత్యం..

- వీఆర్వో పి.జయలక్ష్మికి షోకాజు నోటీసు.

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వరద ప్రభావిత ప్రాంతాల్లో చేపడుతున్న సహాయక చర్యల్లో నిర్లక్ష్యం, బాధ్యతారాహిత్యంతో వ్యవహరించినట్లు ఫిర్యాదు నేపథ్యంలో 259వ వార్డు సచివాలయం వీఆర్వో పి.జయలక్ష్మికి షోకాజు నోటీసు ఇచ్చినట్లు జిల్లా కలెక్టర్ డా. జి.సృజన సోమవారం తెలిపారు. అజిత్ సింగ్ నగర్ ప్రాంతంలో నిత్యవసర సరుకుల పంపిణీ పాయింట్ వద్ద పబ్లిక్ తో అమర్యాదగా ప్రవర్తించిన ఆరోపణలు నేపథ్యంలో షోకాజ్ నోటీసు ఇచ్చినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం వరద ప్రభావిత ప్రాంతాల్లో ఒకవైపు వరదను నియంత్రించే చర్యలతో పాటు మరోవైపు బాధితులకు సహాయ సహకారాలు అందించడంపై ప్రతిష్టాత్మకంగా దృష్టి సారించినందున బాధ్యతగా వ్యవహరించాల్సిన వారు నిర్లక్ష్యం వహించినా, బాధ్యతారాహిత్యంతో వ్యవహరించినా చర్యలు తప్పవని కలెక్టర్ హెచ్చరించారు. ప్రజలకు ఆపన్నహస్తం అందించడంలో ప్రతి ఒక్కరూ చిత్తశుద్ధితో, నిబద్ధతతో పనిచేయాలని ఈ సందర్భంగా కలెక్టర్ సృజన సూచించారు.

ముంపు ప్రాంతాల్లో మంత్రుల పర్యటన

విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం : జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో సహాయక చర్యలు పరిశీలించి వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించాలని, ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురి కావద్దని రాష్ట్ర గనులు, భూగర్భ వనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర, రాష్ట్ర గృహ నిర్మాణం, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థ సారథి, రాష్ట్ర బిసి సంక్షేమం, ఆర్థిక బలహీన వర్గాలు, చేనేత జౌళి శాఖ మంత్రి ఎస్. అనిత, బందరు ఎంపి వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యే జిల్లాలోని ముంపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేస్తు తగు చర్యలు తీసుకుంటున్నారు. జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ ముంపు ప్రాంతాల్లో పర్యటిస్తూనే మరోపక్క ఎప్పటికప్పుడు సమావేశాలు, వీడియో కాన్ఫరెన్స్‌లు నిర్వహించడంతో పాటు చరవాణి ద్వారా జిల్లా అధికారులను క్షేత్రాధికారులను వరద సహాయక చర్యలు ముమ్మరంగా చేపట్టాలని అప్రమత్తం చేస్తున్నారు. జిల్లాలో అధిక వర్షాలు, వరదల కారణంగా ముంపు బారిన పడిన ప్రజలను జిల్లా యంత్రాంగం అహర్నిశలు శ్రమిస్తూ సంరక్షిస్తుంది. పునరావాస కేంద్రాల వద్ద వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు అవసరమైన మందులు వైద్య సిబ్బందితో వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. ముంపు ప్రాంతాల్లో ఉండే గర్భిణీ స్త్రీలను ముందుగానే గుర్తించి సురక్షితంగా ప్రభుత్వ ఆసుపత్రులకు తరలించి వైద్యసేవలు అందేలా చేశారు. జిల్లా లోని 16 మండలాల్లోని 97 గ్రామాలకు గాను 68 గ్రామాల్లో వరద ప్రభావం చూపగా ఇప్పటివరకు 68 కేంద్రాలను ఏర్పాటు చేసి 11,287 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించారు. ప్రస్తుతం 41 పునరావాస కేంద్రాలు, 41 వైద్య శిబిరాలు నడుస్తుండగా అందులో 6,666 మంది సురక్షితంగా ఉన్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువులకు 18.9 మెట్రిక్ టన్నుల పశుగ్రాసాన్ని ఉచితంగా పంపిణీ చేశారు. జిల్లాకు 40 మంది ఎన్ డి ఆర్ ఎఫ్, ఎస్ డి ఆర్ ఎఫ్ సిబ్బందిని రప్పించి వారి ద్వారా వరద బాధిత ప్రజలకు సేవలందిస్తున్నారు. బందరు డివిజన్ లోని చల్లపల్లి, నాగాయలంక, మోపిదేవి, కోడూరు, అవనిగడ్డ, పెడన మండలాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. గుడివాడ డివిజన్లో గన్నవరం, ఉంగుటూరు, పెదపారుపూ డి, నందివాడ, బాపులపాడు, గుడివాడ మండలాలు, ఉయ్యూరు డివిజన్లో పెనమలూరు, కంకిపాడు, పమిడి ముక్కల, తోట్లవల్లూరు మండలాల్లో పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేశారు. మండలాలకు, గ్రామాలకు ప్రత్యేక అధికారులను నియమించి సహాయక చర్యలు చేపట్టడంతో పాటు పునరావాస కేంద్రాల్లో ప్రజలకు అసౌకర్యం కలుగకుం డా నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో కుటుంబాలకు 25కేజీల బియ్యం, కిలో కంది పప్పు, కిలో పామాయిల్, కిలో చెక్కర, 2 కిలోల ఉల్లిపాయలు, 2కిలోల బంగాళా దుంపలు చొప్పున నేరుగా పంపిణీ చేశారు. ఉచిత వైద్య కిట్లులను అందించారు. జిల్లాలో 266 విద్యుత్ సబ్‌స్టేషన్లు, ఫిదర్లు, స్తంభాలు వర్షానికి దెబ్బతినగా వాటిని పునరుద్ధరించారు.

సీపీఐ సీనియర్ నాయకులు సుబ్బారావు మృతి

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సీపీఐ సీనియర్ నాయకులు అంగి రేకుల సుబ్బారావు (93) మృతి చెందారు. సీపీఐ పార్టీలో గ్రామ సీపీఐ శాఖ మాజీ కార్యదర్శిగా పనిచేశారు. గ్రామంలో పార్టీ కార్యక్రమాలు, పార్టీ నిర్మాణానికి కృషి చేశారు. ఆయన మృతదేహానికి నాయకులు పార్టీ పతాకాన్ని కప్పి, నివాళులు అర్పించారు. కౌలు రైతుదారుల సంఘం జిల్లా నాయకులు పెయ్యల వెంకటేశ్వరరావు, సీపీఐ నాయకులు పెయ్యల వృథ్వి, పెయ్యల కృష్ణ మోహన్, బత్తుల సత్యనారాయణ, బేతు రాయప్ప, తదితర కార్యకర్తలు నివాళులు అర్పించారు. సీపీఐ సీనియర్ నాయకులు అంగిరేకుల సుబ్బారావు మృతికి సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తీవ్ర సంతాపం తెలిపారు.

వరద బాధితులకు అండగా...

విశాలాంధ్ర-జగ్గయ్యపేట : రాష్ట్రంలో భారీగా కురిసిన వర్షాలతో వరద ముంపుకు గురైన వరద బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా ఉందని, దాతృత్వంతో ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్ కళ్యాణ్ ప్రతి పంచాయతీకి లక్ష రూపాయలు చొప్పున ప్రకటించారని,ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. పట్టణంలోని కొత్త కళ్యాణ మండపంలో సోమవారం జగ్గయ్యపేట నియోజకవర్గంలో 21గ్రామాల్లో వరద ముంపుకు గురైన నియోజకవర్గంలోని ఒక్కొక్క గ్రామానికి లక్ష రూపాయల చొప్పున స్థానిక జనసేన,బిజెపి,తెలుగుదేశం పార్టీ కూటమి నాయకులతో కలసి ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ టతాతయ్యఉ లక్ష రూపాయల చెక్కులను గ్రామ పంచాయితీ సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో కూటమి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు నిత్యావసరాలు

విశాలాంధ్ర-పెనుగంచిప్రోలు : మండలంలోని అనిగండ్లపాడు లో అమ్మ నాన్న సోషల్ సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం కొంతమంది వరద బాధితులకు నిత్యావసరాలు అందజేశారు. అమ్మ నాన్న సోషల్ సేవా ఫౌండేషన్ స్థాపకులు మరియు కన్వీనర్ దోర్నాల. నాగయ్య టీచర్ డి.దాన్నయ్య, దోసపాటి నాగేశ్వరరావు, గొర్ల. ప్రేమ నందం దోర్నాల విజయబాబు, దోర్నాల అలీసమ్మ కోడిపర్తి, పద్మ రావు, చింతా డేవిడ్, శిరం జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకుంటాం

విశాలాంధ్ర-నందిగామ: కంచలలో మండల వ్యవసాయ, రెవిన్యూ అధికారులతో కలిసి కంచల్లో మునేటి వరద వల్ల పూర్తిగా నష్ట పోయిన పంట పొలాలను మండల తెలుగు దేశం పార్టీ అధ్యక్షుడు వీరంకి వీరాస్వామిన్ పరిశీలించారు. వీరా స్వామిన్ మాట్లాడుతూ వరదతో నష్ట పోయిన ప్రతి ఒక్క రైతునీ ఆదుకునేందుకు ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, ఎంపీ కేశినేని శివనాథ్ చిన్నితో మాట్లాడి నష్ట పరిహారం రావటానికి కృషి చేస్తామని రైతులకు భరోసా ఇచ్చారు. కంచల గ్రామ తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు రామిరెడ్డి సుబ్బారావు,గ్రామ పార్టీ అధ్యక్షుడు రామిరెడ్డి శ్రీనివాసరావు, మాదాల సురేష్, పెర్నా వేణు,సీతారామయ్య మరియు రైతులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే సౌమ్యని కలిసిన అధికారులు

విశాలాంధ్ర-నందిగామ: స్థానిక కాకానినగర్ ఎమ్మెల్యే కార్యాలయంలో సోమవారం నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యని నందిగామ పట్టణ సిఐ నాయుడు, తహసిల్దార్ సురేష్‌బాబు, ఎస్ఐ శాతకర్ణి మర్యాదపూర్వకంగా కలిశారు.

కమిషనర్‌ని కలిసిన యూనియన్ నాయకులు

విశాలాంధ్ర-మచిలీపట్నం : విజయవాడలోని కార్మిక పడుతున్న ఇబ్బందులను నగర కమిషనర్ సిహెచ్ వివిఎస్‌ఎస్ రాజు దృష్టికి సోమవారం మున్సిపల్ కార్మిక యూనియన్ నాయకులు తీసుకువెళ్లింది. డిప్యూటేషన్ మీద విజయవాడలో తల ఎత్తిన వరద ఉధృతికి మచిలీపట్నం నుండి 1850 మంది వెళ్లారు. కార్మికులు వెళ్లి పది రోజుల్లో అవుతుందని, ఎండనక వాననక వారు పడుతున్న ఇబ్బందులతో వర్షంలో తడుస్తున్న వల్ల వారు అనారోగ్య పాలవుతున్నారని, అక్కడ కార్మికులకు సరైన సౌకర్యాలు లేక విషపూరితమైన పాములు, తదితర జంతువుల నుండి వారు పడుతున్న ఇబ్బందులను కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లారు. కమిషనర్ స్పందిస్తూ మున్సిపల్ కార్మికులను రెండు మూడు రోజులలో వెనక్కి పిలిపిస్తామని, అలాగే వారి ఖర్చులు అందజేస్తామని, కార్మికులకు ఏ విధమైన ఇబ్బందులు లేవని ఆయన తెలిపారని నాయకులు తెలిపారు. సీపీఐ నాయకులు మోదుమూడి రామారావు, మున్సిపల్ వర్కర్స్ నాయకులు యర్రంశెట్టి ఈశ్వరరావు, సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి ఒడుగు చైతన్యకుమార్ కమిషనర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

పాము కాటుతో ఒకరి మృతి

విశాలాంధ్ర-ఏ కొండూరు: యన్టీఆర్ జిల్లా తిరువూరు నియజక వర్గం ఏ కొండూరు మండలం లోని జిల్లకుంట గ్రామానికీ చెందిన ధరవత్ రాజు ఆదివారం సాయంత్రం పాము కాటుకు గురై మరణించినట్లు కుమారుడు రవి తెలిపాడు. సేకరించిన వివరాల ప్రకారం రాజు ఆదివారం ఉదయం పోలం పనులు నిమిత్తం వెళ్ళి సాయంత్రానికి కూడా తిరిగి రావకపోవడంతో కుమారుడు రవి పొలం వెళ్లి చూడగా తండ్రీ విగత జీవిగా పడి ఉండటాన్ని చూసి, తక్షణమే తిరువూరు ప్రభుత్వ ఆసుపత్రి తరలించగా వైద్యులు రాజు మణించిన విషయాన్ని ధృవ పరిచారు. కుమారుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏ కొండూరు ఎస్ఐ చల్లా కృష్ణ తెలిపారు. మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి, కుటుంబం సభ్యులకు అందచేశారు.

గల్లంతైన ఫణి మృతదేహం లభ్యం

విశాలాంధ్ర-గన్నవరం : కేసరపల్లి వద్ద మూడు రోజుల క్రితం బుడమేరు కాలువలో గల్లంతైన కలదిండి ఫణి ఆచూకీ లభ్యమైంది. కారుకి కొద్దిదూరంలో మృతదేహాన్ని గుర్తించినట్లు ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది తెలిపారు. హైదరాబాదు నుండి వచ్చి గన్నవరంలో స్నేహితుడిని కలిసి తిరిగి కారులో స్వగ్రామం వెళుతుండగాకేసరపల్లి-ఉప్పులూరు మధ్య బుడమేరు వరదలో ఫణి గల్లంతయ్యాడు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ చేస్తున్నాడు. ఫణికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ఫణి మృతదేహాన్ని గన్నవరం ప్రభుత్వ హాస్పిటల్‌కు తరలించి, పోస్టుమార్టం అనంతరం ఫణి మృతదేహాన్ని స్వగ్రామం హాస్సేన్ నగర్‌కు తరలించనున్నారు. పోలీసులు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వరద బాధితులకు గ్యాస్ స్టవ్‌ల రిపేర్లు

విశాలాంధ్ర-విజయవాడ కల్చరల్ : వరద ముంపు ప్రాంతాలలో వరద నీటిలో మునిగిపోయిన గ్యాస్ స్టవ్‌లను ఉచితంగా రిపేరు చేస్తున్నట్లు మారుతి గ్యాస్ కంపెనీ అధినేత డాక్టర్ చెట్లపల్లి మారుతి ప్రసన్న తెలిపారు. ముత్యాలంపాడు గవర్నమెంట్ ప్రెస్ సమీపాన ఏర్పాటు చేసిన శిబిరంలో రిపేర్లను ప్రారంభించారు. విశాఖపట్నం సివిల్ సప్లైస్ జిల్లా అధికారి సూర్య ప్రకాష్ మాట్లాడుతూ వరద ముంపుకు గురైన వారికి ఎటువంటి అసౌకర్యం, ఇబ్బంది కలగకూడదనే ప్రభుత్వ ఆదేశాల మేరకు విశాఖ నుంచి వచ్చి విజయవాడ నగరంలో పది ప్రాంతాలలో గ్యాస్ కంపెనీల ద్వారా ఈ ఉచిత రిపేర్ సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మారుతీ ప్రసన్న తన గ్యాస్ కంపెనీ ఉద్యోగ బృందంతో వరద ముంపు వాసులకు వేడి పాలు, బిస్కెట్ ప్యాకెట్లు అందించారు. డిప్యూటీ డైరెక్టర్ భావనారాయణ కూడా వరద ప్రాంతాల సేవలలో ఉన్నట్టు తెలిపారు.

ఆరోపణలు చేయటం తగదు

విశాలాంధ్ర-విజయవాడ (గాంధీనగర్) : నగరంలో ప్రళయం సృష్టించిన వరదలు వలన ప్రజలందరు అష్టకష్టాలు పడుతున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పెద్దఎత్తున సహాయక కార్యక్రమాలు చేపడుతూ ఉంది మరోపక్క ముఖ్యమంత్రి చంద్రబాబు ఆ వయస్సులో కూడా కలెక్టర్ కార్యాలయంలో నుండి అధికారులను ప్రోత్సహిస్తూ బాధితులకు ఎటువంటి ఇబ్బందిలేకుండా సహాయం చేస్తూంటే వైసిపి పార్టీ ఆరోపణలు,విమర్శలు చేయటం మంచిది కాదని చేతనైతే సహాయం చేయాలని అభ్యుదయ గ్రామీణ స్టేట్ కమిటీ డ్వాక్రా ప్రెసిడెంట్ దేవకి దేవి సూచించారు.సోమవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ మా డ్వాక్రా సంఘాల ద్వారా అనేక సహాయక కార్యక్రమాలు చేశాము. కరోనా సమయంలో చాలా సేవా కార్యక్రమాలు చేసామన్నారు.రాష్ట్రంలో వచ్చిన వరదలను సీఎం చంద్రబాబు సమర్థవంతంగా ఎదుర్కొన్నారు వారికి మా డ్వాక్రా సంఘాల తరపున కృతజ్ఞతలు తెలియజేస్తున్నాము అన్నారు.75 సంవత్సరాలలో కూడా ఆయన కుర్రాడిలా పనిచేస్తున్నారు. ఎవ్వరికీ ఎటువంటి ఇబ్బంది లేకుండా వరద బాధితులకు సహాయం అందిస్తున్నారన్నారు.ఇది చూసి ఓర్వలేక మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి అసత్య ప్రచారాలు చేస్తున్నారన్నారు. వరద బాధితులకు కనీస సహాయం చేయలేదు ఒక రొట్టె కూడా పంచలేదు,తన వెంట లారీ జనాన్ని వేసుకొని వచ్చి ఆరోపణలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.ఆపదలో ఉన్న వారిని ఆదుకోకపోగా. ప్రభుత్వం మీద బురద చల్లే కార్యక్రమాలు చేయటం తగదు అన్నారు.

CHANGE OF NAME

I, Athukuri Siva Rama Swami (Old Name), S/o. Athukuri Haranadh, R/o. D.No. 75-7-27, Lakshmi Nivas, Nagarjuna Street, Bhavanipuram, Vijayawada - 520 012, NTR Dist., A.P. I, declare that I, have changed my name as **ATHUKURI SIVA RAMA SWAMY** (New Name). Here after my name is known and called as **ATHUKURI SIVA RAMA SWAMY.**

కమ్యూనిస్టు పార్టీలు ప్రజాసేవకే అంకితం

విశాలాంధ్ర-చల్లపల్లి : కమ్యూనిస్టు పార్టీలు ప్రజాసేవకే అంకితం అవుతాయని సీపీఐ కృష్ణా జిల్లా సహాయ కార్యదర్శి అడ్డాడ ప్రసాద్ బాబు పేర్కొన్నారు. లంక భూముల పోరాట యోధుడు, కామ్రేడ్ మాలేంపాటి బాల భాస్కరరావు 51వ వర్ధంతి చల్లపల్లి మండలం నిమ్మగడ్డలో సోమవారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన అడ్డాడ ప్రసాద్ బాబు మాట్లాడుతూ కమ్యూనిస్టుల చరిత్ర త్యాగాల మయమని కొనియాడారు. ప్రతి పేదవాడికి భూమి దక్కాలనే నినాదంతో వేల ఎకరాల లంక భూములను పేదల పరం చేసిన ఘన చరిత్ర బాల భాస్కరరావుదని పేర్కొన్నారు. లంకల ప్రాంతంలో ప్రతి పేదవాడు తన సొంత భూమిలో సాగు చేసుకుంటున్నాడంటే ఆనాటి కమ్యూనిస్టు పార్టీ, బాల భాస్కర రావుల కృషి ఫలితమేనని పేర్కొన్నారు. పదవులు ఆశించకుండా ప్రజల పక్షాన పోరాటాలు చేసిన ఘన చరిత్ర కమ్యూనిస్టులకే దక్కుతుందన్నారు. పేదల పక్షాన జరిగిన అనేక పోరాటాలలో దివి తాలూకాలో 48 మంది కమ్యూనిస్టులు అమరవీరులై తాము నమ్ముకున్న ఉద్యమాన్ని ముందుకు సాగించారని

గుర్తు చేశారు. ఆనాడు చల్లపల్లి నారాయణ రావు మొదలు కొని, నేడు హనుమానుల చిన్నబ్బాయి వరకు ప్రభుత్వ ఉద్యోగాలను వదిలి పేదలపక్షాన పోరాటాలు చేశారని, అలాంటి త్యాగాలు ఒక్క కమ్యూనిస్టులు మాత్రమే చేయగలరన్నారు. ఒకసారి అధికారం రాకపోతేనే పార్టీలు కనుమరుగవుతున్న నేపథ్యం లో ఏ అధికారం లేకపోయినా 100 సంవత్సరాల నుండి కమ్యూనిస్టు పార్టీలు పేద ప్రజల పక్షాన నిలిచి, పోరాటలు చేస్తున్నాయని తెలిపారు. ఇలాంటి చరిత్ర మరి ఏ పార్టీకి లేదన్నారు. మహిళా సమాఖ్య నాయకురాలు కంచర్ల ప్రభు కుమారి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గుత్తి కొండ రామారావు, సాతూరి సంగీతరావు, బడుగు దేవ సహాయం, మల్లుపెద్ది బోసు, మాలెంపాటి కోటేశ్వరరావు, నాగినేని శ్రీమన్నారాయణ,బడుగు భాస్కర్, బడుగు విశ్వేశ్వరరావు, కంచర్ల ప్రసాద్, పెన్మత్స ప్రభాకర్ రావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు చీరల పంపిణీ

విశాలాంధ్ర-చల్లపల్లి : రావెళ్ల ఫౌండేషన్ సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ ప్రశంసించారు. చల్లపల్లి మండలం ఆముదార్లంకలో 500 మంది వరద బాధితులకు రావెళ్ల ఫౌండేషన్ చైర్మన్ రావెళ్ల ఉదయ్‌కుమార్ ఆధ్వర్యంలో రూ.90వేల విలువైన చీరలు పంపిణీ చేయగా, ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్ము పాల్గొని బాధితులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్ష కార్యదర్శులు నిడమానూరి దిలీప్కుమార్, రావెళ్ల విజయ్, టీడీపీ నేతలు పాల్గొన్నారు.

వరద బాధితులకు ప్రభుత్వ సాయం

విశాలాంధ్ర-చల్లపల్లి : వరద బాధితులకు ప్రభుత్వం మంజూరుచేసిన బియ్యం, నూనె, కందిపప్పు, పంచదార, ఉల్లిపాయలు, బంగాళదుంపలను పంపిణీ చేశారు. తహసీల్దార్ డి.వనజాక్షి ఆధ్వర్యంలో ఇన్చార్జి డీటీ ఘంటసాల కృష్ణమోహన్ పర్యవేక్షణలో ఆముదార్లంకలో 373 మందికి, చల్లపల్లిలో 11 మందికి, లక్ష్మీపురంలో 15 మందికి, మంగళాపురంలో 10 మందికి, మాజేరులో 66 మందికి మొత్తంగా 475 మందికి పంపిణీ చేపట్టారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులకు వైద్య పరీక్షలు

విశాలాంధ్ర-గన్నవరం : ఉంగుటూరు మండలంలోని ఎలుక పాడు గ్రామంలో క్రౌన్ గాస్పెల్ మినిస్ట్రీస్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోమవారం ఉచిత మెడికల్ క్యాంపును నిర్వహించారు. ట్రస్ట్ చైర్మన్ పాస్టర్ రమేష్ పాల్ అవుటపల్లి పుట్టినరోజు సందర్భంగా 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచిత మందులను పంపిణీ చేశారు. అంతేకాకుండా 300 మందికి స్నాక్స్ ను అందజేశారు. గ్రామ మాజీ సర్పంచ్ మున్నంగి నిరీక్షణరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఎంపీడీఓ జీఎస్ వి శేషగిరిరావు ,తహసిల్దార్ విమల కుమారి, ఈఓపిఆర్డీ అమీర్ భాషలు మాట్లాడుతూ క్రౌన్ గాస్పల్ మినిస్ట్రీస్ చైర్మన్ రమేష్ పాల్ చేస్తున్న సామాజిక సేవలను కొనియాడారు. వీరు మరింత సేవలు అందించాలని ఆకాంక్షించారు.

వరద బాధితులకు చేయూత

విశాలాంధ్ర-కంచికచర్ల : కంచికచర్ల మండల పరిధిలోని గల పెండ్యాల గ్రామానికి చెందిన జేఎం ఫౌండేషన్, ఏపీఎస్ఏ ఆధ్వర్యంలో విజయవాడ సింగ్ నగర్ వరద బాధి త కుటుంబాల వారికి సోమవారం ఆహారం, వాటర్ బాటిల్స్ బిస్కెట్ ప్యాకెట్లను ఫౌండేషన్ నిర్వాహకులు అందజేశారు. ప్రకృతి వైపత్యాలు వల్ల సర్వం కోల్పో యిన వంద లాదిమంది ప్రజలు అల మటిస్తున్న అభాగ్యులకు ఈ ఫౌండే షన్ ద్వారా చేయూతనివ్వటం ఎంతో సంతోషదాయకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో జయం ఫౌండేషన్ సభ్యులు షేక్ గౌస్ బాషా షేక్ ఫాహీమ్ షేక్ మన్నాన్ షేక్ సయ్యద్ అహ్మద్ షేక్ నీముద్దీన్ మరియు మక్బుల్ నవాబ్ ఆల్సో యూసుఫ్ జబ్బర్ జయం ఫౌండేషన్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కళాకారుల ఫించన్లు పంపిణీ

విశాలాంధ్ర-గుడివాడ : స్థానిక కన్యకా పరమేశ్వరి దేవస్థానం చైర్మన్ జవాజీ గంగరాజు గుడివాడ కళాకారుల సమాఖ్య అధ్వర్యంలో సోమవారం కళాకారులు సమైఖ్య సభ్యులు 20 మంది పేద కళాకారులు రూ. 1000 చొప్పున అందజేశారు. ఈ కార్యక్రమంలో డైట్ కళాశాల మాజీ ప్రిన్సిపల్ అంజనేయులు, అధ్యక్షుడు విన్నకోట సత్యనారాయణ(బుజ్జి), గౌరవ అధ్యక్షుడు బి.వి రామమోహనరెడ్డి, కార్యదర్శి టి.ఎస్ బాబు ఉపాధ్యాక్షులు లోయ రాధకృష్ణ, లంకపల్లి ప్రకాష్, సభ్యులు మల్లిక్, పాత శ్యామ్, బి.వి సత్యనారాయణ, వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

ముంపు బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే వెనిగండ్ల

విశాలాంధ్ర-గుడివాడ : నందివాడ మండలంలో వరద ముంపునకు గురైన తమిరిశ, అనమనపూడి, శంకరంపాడు, పోలుకొండ గ్రామాల్లో సోమవారం ఎమ్మెల్యే రాము పర్యటన చేపట్టారు. మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావుతో కలసి ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ ప్రజల సంరక్షణకు ప్రభుత్వం తక్షణమే పరిష్కరించే విధంగా అన్ని చర్యలు తీసుకుంటుందన్నారు. వర్షాల ప్రభావం, ఎగువ నుండి వస్తున్న వరద నీటి వల్ల మరో రెండు రోజులు ముంపు సమస్య కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి పిన్నమనేని వెంకటేశ్వరరావు, శంకరంపాడు సర్పంచ్ కైలే సుబ్బారావు, మండల పార్టీ అధ్యక్షుడు దానెటి సన్యాసిరావు, నాయకులు పిన్నమనేని బాబ్జి, ఉప్పల వెంకటేశ్వరరావు, ప్రభుత్వ శాఖల

అధికారులు, పాల్గొన్నారు.

రూ.50 వేల సీఎం రిలీఫ్ ఫండ్

స్థానిక ఏలూరురోడ్డులోని టిడిపి కార్యాలయంలో సోమవారం వరద బాధితుల సహాయార్థం కొండపల్లి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ కొండపల్లి చంద్రశేఖం రెడ్డి రూ 50వేల సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును ఎమ్మెల్యే వెనిగండ్ల రాముకు అందజేశారు. ఎమ్మెల్యే రాము మాట్లాడుతూ సర్వం కోల్పోయిన బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందన్నారు. బాధితుల సహాయార్థం ప్రభుత్వాలు చేస్తున్న కృషికి దాతలు పెద్ద మనసుతో ముందుకు వచ్చి తమ శక్తి మేరకు సహాయం అందించాలన్నారు. నందివాడ మండలం వరద ముంపులో ఉందని, దాతలు స్వచ్ఛంద సంస్థలు ముందుకు వచ్చి వారికి సహయం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపి ఎన్‌జీవోస్ అసోసియేషన్ గుడివాడ శాఖ ప్రధాన కార్యదర్శి గోగులమూడి రాజేంద్రప్రసాద్, టిడిపి నాయకులు కామేపల్లి తులసిబాబు, చేవూరు జగన్మోహనరావు, గడ్డం ప్రకాష్‌దాస్, తదితరులు పాల్గొన్నారు.

ముంపులోనే కొనసాగుతున్న కోసూరు ఆయకట్టు

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ మండలంలోని కోసూరు, పాలంకిపాడు గ్రామాల మధ్య గల కోసూరు ఆయకట్టులోని వరిపొలాలు నీటి ముంపు లోనే కొట్టుమిట్టు లాడుతున్నాయి.ఈ ముంపు పై అటు అధికారులు గానీ ఇటు పాలకులు గాని దృష్టి సారించిన దాఖలాలు కానరావడం లేదు దీనితో ఆ పొలాలునేటిక నీటి ముంపులోనే కొనసాగుతున్నాయి. ఈ ప్రాంతంపై దృష్టి పెట్టి నీరుతొలగేందుకుచర్యలు చేపట్టి వరి చనిపోతే ప్రత్యామ్నాయ పైరు సాగు కి సహకారం ఇవ్వాలని కోరుతున్నారు.

అంగన్వాడీల గృహ సందర్శన

విశాలాంధ్ర-కూచిపూడి : పోషకాహార పక్షోత్సవాలలో భాగంగా ప్రారంభమైనరెండో వారం సోమవారం నుంచి అంగన్వాడీ కేంద్రాలలో గృహ సందర్శన కార్యక్రమం ప్రారంభించారు. ఎన్.ఎం. ఆఫ్ కూచిపూడి ఎంపీ ఎలిమెంటరీ పాఠశాల వద్ద గల అంగన్వాడీ కేంద్రంలో సోమవారం కార్యకర్త ఆర్ నాగమణి ప్రారంభించారు. ఈ సందర్భంగాదళితవాడలోని గృహాలకు వెళ్లి సూచనలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కూచిపూడి సచివాలయ ఏ ఎన్ ఎం దగానివసుంధర, ఆశా వర్కర్లు జశాంక, విజయలక్ష్మి, శ్యామల పాల్గొన్నారు.

నిమజ్జనాల్లో జాగ్రత్తలు పాటించాలి : కమిషనర్



విశాలాంధ్ర-నందిగామ రూరల్ న్యూస్:- వినాయక నిమజ్జనంలో సూచనలను పాటించాలని మునిసిపల్ కమిషనర్ ఈ వి రమణబాబు కోరారు. సోమవారం పోలీసు, మున్సిపల్ సిబ్బంది తో కలిసి స్థానిక మునేటి పెద్ద బ్రిడ్జిపై వినాయక నిమగ్నాలు జరుగు ప్రాంతాన్ని ఆయన పరిశీలించారు. మున్నేరు బ్రిడ్జిను మునిసిపల్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ జె. ఫణి శ్రీనివాస రావు, సీఐ శాతకర్ణితో కలిసి పరిశీలించారు.

బాధితులను ఆదుకుంటాం : ఎమ్మెల్యే సౌమ్య

విశాలాంధ్ర-కంచికచర్ల : వరద ముంపునకు గురైన గ్రామీణ రైతంగంతోపాటు ప్రజలను కూడా ప్రభుత్వం అన్ని విధాల ఆదుకుటుందని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య పేర్కొన్నారు. కంచికచర్ల మండల పరిధిలోని వరద ముప్పుకు గురైన గ్రామాలైన కొత్తపేట,గనిఆత్కూరు గ్రామాలను టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కోగంటి బాబుతో కలిసి సోమవారం ఎమ్మెల్యే పర్యటించారు. ఈ కార్యక్రమంలో భాగంగాఎమ్మెల్యే తంగిరాల సౌమ్య కొత్తపేట గ్రామంలో వరద ముంపుకు గురైన ఇళ్లు,పంట పొలాలు తో పాటు గని ఆత్కూరు నందుగల జిల్లా పరిషత్ హైస్కూల్ను కూడా అధికారులు,నాయకులుతో కలిసి ఎమ్మెల్యే సోమవారం పరిశీలించి కొత్తపేట,గని ఆత్కూరు గ్రామ సచివాలయం నందు వరద ముంపు పై జరిగిన నష్టాల అంచనా లపై అధికారులతో ఎమ్మెల్యే సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల టిడిపిపార్టీ అధ్యక్షులు కోగంటి బాబు, తాసిల్దార్ జాహ్నవి,ఎంపీడీవో దీప్తి,పిఓపిఆర్డి బి శ్రీనివాసరావు, నంది గామ అగ్రికల్చర్ ఏడి ఐకె శ్రీనివాస్, సిఐ చవాన్,ఎస్సై రాజు, సర్పంచ్ షేక్ ఇబ్రహీం,జిల్లా తెలుగు రైతు ఉపాధ్య క్షులు మోరకొండ ఏడుకొండలు,ఎంపీ టీసీ సభ్యులు వెంపరాల వెంకటేశ్వ రావు, గుదే నరేష్, అధికారులు పాల్గొన్నారు.

విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో అన్నదానం

విశాలాంధ్ర-తాడేపల్లి : వినాయక చవితి ఉత్సవాలను పురస్కరించుకొని మహానాడు 16వ లైన్‌లో సోమవారం శ్రీ విఘ్నేశ్వర సేవా సమితి ఆధ్వర్యంలో మూడు వేల మంది భక్తులకు అన్నదానం నిర్వహించారు. ముందుగా గణేశునికి ప్రత్యేక పూజలు నిర్వహించి ప్రసాదాలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సమితి సభ్యులు సంక్రాంతి అశోక్, చింతం ఆనంద్, గిడ్డా నారాయణ, వెంకటేశ్వర్లు, జోషి, పండు, రవి, వెంకటపతి, ఈశ్వర రావు, వెంకటేశ్వర్లు, మధు, వెంకట లక్ష్మయ్య, బాలకృష్ణ, రామయ్య, శ్రీను, తిరుపతయ్య, గంగయ్య, కిరణ్, టీడీపీ నాయకులు ముమ్మిడి సత్యనారాయణ, దానబోయిన సుందరరావు యాదవ్, జంగాల వెంకటేష్, ఇట్టా భాస్కర్, ఒలేటి రాము, జంజు మరియదాసు, అన్నెం కుసుమ, అంకలరావు(పండు) తదితరులు పాల్గొన్నారు.

షార్ సందర్శనకు తరలివెళ్లిన విద్యార్థులు

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : చిల్డ్రన్స్ స్పేస్ క్లబ్ ఆఫ్ ఇండియా వ్యవస్థాపకులు జి.శాంతమూర్తి ఆధ్వర్యంలో స్థానిక అంకిరెడ్డిపాలెం జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు శ్రీహరి కోటకు గుంటూరు నుంచి సోమవారం రాత్రి బస్సులో బయలుదేరివెళ్లారు. శ్రీహరికోటలోని షార్ అంతరిక్ష కేంద్ర సందర్శనకు 40 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు వెళ్ళినట్లు శాంతమూర్తి తెలిపారు. గత 15 సంవత్సరాలుగా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాలు, ఇతర రాష్ట్రాల నుంచి విద్యార్థులను ఎంపిక చేసి సందర్శనకు పంపిస్తున్నట్లు వెల్లడించారు. అంతరిక్ష కేంద్ర సందర్శన వలన విద్యార్థులలో ఆలోచనశక్తి, సృజనాత్మక భావాలు పెరుగుతాయని అన్నారు.

సత్యా ఎలక్ట్రానిక్స్ షోరూమ్ ప్రారంభం

విశాలాంధ్ర-తాడేపల్లి : బైపాస్ రోడ్డులో మణిపాల్ హాస్పిటల్ ఎదురుగా పీఆర్ హైట్స్‌లో సత్యా ఎలక్ట్రానిక్స్ నూతన షోరూమ్ సోమవారం ప్రారంభించారు. భవన యజమానులు తోలేటి పద్మరాజు, తోలేటి దుండీ మోహన్ రిబ్బన్ కట్ చేసి షోరూమ్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా సత్యా ఏజెన్సీస్ యాజమాన్యం వారు మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటివరకు 31 షోరూమ్‌లు ఉన్నాయని, ఇప్పుడు తాడేపల్లిలో 32వ షోరూమ్‌ను ప్రారంభించడం తమకు ఎంతో ఆనందంగా ఉందని అన్నారు. గొప్ప ఆఫర్లతో అందరికీ అందుబాటు ధరల్లో వస్తువులు అందించడమే లక్ష్యంగా పెట్టుకొని ముందుకు వెళ్తున్నామని తెలిపారు. మార్కెట్‌లో ఎక్కడాలేని విధంగా సున్నా డౌన్ పేమెంట్‌తో ఎలక్ట్రానిక్ వస్తువులు లభిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో సత్యా ఏజెన్సీ ఎండీ జాన్సన్, ఏపీ హెడ్ సెంథిల్, పీఆర్ హైట్స్ కమర్షియల్ కాంప్లెక్స్ డెవలపర్స్ ప్రతినిధులు కొండా ప్రతాప్ రెడ్డి, తన్నేటి మహేష్ రెడ్డి, ప్రముఖ బ్రాండ్ల కంపెనీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ప్లేట్లు, గ్లాసులు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : మంగళగిరి జీఆర్ మున్సిపల్ ప్రైమరీ స్కూల్‌లో మధ్యాహ్న సమయంలో పిల్లలు భోజనం ప్లేట్లు లేక ఇబ్బంది పడుతున్నారని స్కూల్ హెచ్ఎం ద్వారా విజయ హెల్త్ కేర్ ట్రస్ట్‌కి సమాచారం అందజేశారు. పిల్లలు పడే ఇబ్బందిని తెలుసుకున్న వెంటనే పాత మంగళగిరి చెనక్కాయలు మిల్లు బిట్రా శ్రీనివాస్‌కి విషయం తెలియపరచగా ఆయన స్కూలు పిల్లలకు భోజనానికి ప్లేట్లు, గ్లాసులు, చాక్లెట్లు ఏర్పాటు చేసి స్వయంగా వారి కుటుంబ సభ్యులతో వచ్చి విజయ హెల్త్ కేర్ ఆధ్వ ర్యంలో వారికి అందజేశారు. సహకారం అందించిన బిట్రా శ్రీనివాస్‌కి విజయ హెల్త్ కేర్ ట్రస్ట్ తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

వెంకటేశ్వర స్వామి గుడిలో చోరీ

టీటీడీ వైఫల్యమేనంటూ గ్రామస్తుల మండిపాటు

విశాలాంధ్ర-తుళ్లూరు : రాజధాని అమరావతి పరిధిలోని తుళ్లూరు మండలం అనంతవరంలోని శ్రీ శ్రీదేవి భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి గుడిలో దొంగతనం జరిగింది. సోమవారం ఉదయం వాచ్‌మెన్, పూజారి వచ్చి చూడగా గుడికి ఉన్న రెండు తలుపుల తాళాలు పగలగొట్టి ఉండడం గమనించారు. లోనికి వెళ్లి చూడగా హుండీకి ఉన్న తాళాలు కూడా పగలగొట్టి ఉండడం, నగదు మాయం కావడం చూసి ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. జరిగిన ఘటనపై గుడి పూజారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై ఆర్.ఏసు రత్నం పూజారులు, అటెండర్, సెక్యూ రిటీ సిబ్బందిని విచారించారు. క్లూస్ టీం పగులగొట్టిన గుడి తలుపులు, హుండీ, పరిసరాలను క్షుణ్ణంగా పరిశీలించింది. వేలిముద్రలు సేకరించారు. వెంకటేశ్వర స్వామి గుడిని కొంత కాలం క్రితం తిరుమల తిరుపతి దేవస్థానంలో విలీనం చేశారు. తరువాత 2015లో కూడా గుర్తుతెలియని వ్యక్తులు గర్భగుడిలోకి ప్రవేశించి వెంకటేశ్వర స్వామి, శ్రీదేవి, భూదేవి విగ్రహాల ముక్కు, చెవులు చెక్కారు. హుండీలో సొమ్ము కాజేశారు. తిరిగి రెండవసారి దొంగ తనం జరగడంతో గ్రామస్తులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. సరైన భద్రత కల్పించకపోవడం, సీసీ కెమెరాలు పనిచేయకపోవడం, 12 మంది సెక్యూరిటీ సిబ్బంది ఉండాల్సి ఉండగా కేవలం గుడి పైన ఒకరు, గుడి కింద ఒక్కరు మాత్రమే ఉండ డంతో దొంగతనానికి వీలు కలిగిందని అంటున్నారు. గుడి నిర్వహణలో టీటీడీ వైఫల్యం వల్లనే దొంగ తనాలు జరుగుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా స్పందించి కనీస భద్రత చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

వరద నిర్వాసితులకు వితరణ

విశాలాంధ్ర-మంగళగిరి : వరదల కారణంగా నిర్వాసితు లైన ప్రజలని ఆదుకునేందుకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యా లయం న్యాయ విభాగపు అధిపతి ప్రొఫెసర్ ఎల్.జయశ్రీ పెద్ద మొత్తంలో వితరణ అందజేశారు. ఆ మొత్తంతో న్యాయవిభాగపు విద్యార్థులు వందలాది మంది నిర్వాసితుల కోసం ఆహార పొట్లాలు, మంచినీరు, అల్పాహారాలను ప్యాకెట్ల రూపంలో విజయవాడలోని సింగ్ నగర్ ప్రాంతంలో సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో ధ్యాపక సిబ్బంది డాక్టర్ పి.వెంకటరమణ, డాక్టర్ ఎన్.రాధిక, పరుచూరి కుమారి, డాక్టర్ వైఎన్‌వీ కిషోర్ కుమార్, డాక్టర్ సురేష్ చెన్నం, డాక్టర్ కె.శివరాం, ఎస్.చంద్రశేఖర్, పీజీ డిపార్ట్‌మెంట్ ఆఫ్ లీగల్ స్టడీస్ అండ్ రీసెర్చ్ విద్యార్థులు నల్లబోతుల కాశీరాం రుద్ర, గిరీష్, ఆనంద్, అహ్మద్, ఎం.సుజాత, కె.ఆనంద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేత్రదానానికి ముందుకు రావాలి

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: ప్రజలంతా అపో హాలు వీడి నేత్రదానానికి ముందుకు రావాలని గుంటూరు నెహ్రూ యువ కేంద్ర జిల్లా అధికారి దేవిరెడ్డి కిరణమై అన్నారు. కేంద్ర ప్రభుత్వ నెహ్రూ యువకేంద్ర అనుబంధ సంస్థ జన చైతన్య సమితి ఆధ్వర్యంలో నేత్ర దాన పక్షోత్సవాల ముగింపు సందర్భంగా కిరణ్మయి మాట్లాడుతూ నేత్రదానం, అంధత్వంపై జన చైతన్య సమితి బృందం ప్రజల్లో అవగాహన కల్పించడం అభినందనీయమ న్నారు. గుంటూరు, పల్నాడు జిల్లాలో విస్తృత స్థాయిలో నేత్రాలపై ప్రభుత్వంతో పాటు స్వచ్ఛంద సంస్థలు ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నాయని జిల్లా తెలుగు రైతు ప్రధాన కార్యదర్శి భాష్యం ఆంజనేయులు అన్నారు. పర్యావరణ పరిరక్షణ ప్రేమికుడు టివిఎన్ వరప్రసాద్ మాట్లాడుతూ మరణాంతరం తమ నేత్రాలను దానం చేసినచో నల్లగుడ్డు అంధత్వంతో బాధపడుతున్న వారికి తిరిగి మరల కంటిచూపును ప్రసాదించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో బుచ్చయ్యపాలెం మాజీ సర్పంచ్ పరుచూరి పూర్ణచంద్రరావు, జన చైతన్య సమితి వ్యవస్థాపక అధ్యక్షులు దాసరి విజయ్ బెన్నిబాబులు పాల్గొన్నారు.

వరద బాధితులకు ఏపీజీఈఏ సహాయం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం (ఏపీ జీఈఏ) నాయకులు జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మిని కలిసి ఇటీవల రాష్ట్రంలో కురిసిన భారీ వర్షాల వల్ల నష్టపోయిన వారికి వరద బాధితుల సహాయార్థం ఏపీ జీఈఏ గుంటూరు జిల్లా పక్షాన రూ.80 వేల చెక్కును సోమవారం అందజేశారు. కలెక్టర్‌కు చెక్కును అందజేసిన వారిలో ఏపీ జీఈఏ గుంటూరు జిల్లా అధ్యక్షులు సయ్యద్ చాంద్‌బాషా, కార్యదర్శి కెవిఎస్ శివారెడ్డి, కార్య నిర్వాహక కార్యదర్శి కరీముల్లా షొఖాదరి, కోశాధికారి పోతురాజు, నగరశాఖ కార్యదర్శి సాంబశివారెడ్డి, మహిళా విభాగం నాయకులు పద్మజ, లీలాబాయి, రోజా, పెద రత్తయ్య, రహమాన్, లక్ష్మీనారాయణ తదితరులు ఉన్నారు.

పూత, పిందె దశకు పత్తి పంట

విశాలాంధ్ర-తాడికొండ: ఈ ఏడాది ఖరీఫ్ సీజన్‌లో రైతులు వేసిన పత్తి పంట పూత, పిందె దశకు చేరింది. మండలంలో ఈ ఏడాది కూడా రైతులు పత్తి పంటను విస్తారంగా సాగు చేస్తున్నారు. ఈ ఏడాది 6000 ఎకరాలకు పైగా రైతులు పత్తిని సాగు చేస్తున్నారు. ఇప్పటికే పంట మూడు అడుగుల పైబడి పెరిగింది. వాతావరణ పరిస్థితులు అనుకూలంగా ఉంటే ఎకరాకు 15 నుంచి 20 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుంది.

పంచాయతీలకు రూ.లక్ష చెక్కుల పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : ఇటీవల కురిసిన భారీ వర్షాల వలన వరద బారిన పడిన గ్రామ పంచాయతీలకు జనసేన పార్టీ అధినేత, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ విరాళం ప్రకటించారు. మంగళగిరి, పొన్నూరు, తాడికొండ నియోజకవర్గం పరిధిలో 21 పంచాయతీలకు ఒక్కొక్క పంచాయతీకి లక్ష రూపాయలు చొప్పున జనసేన పార్టీ ఆధ్వర్యంలో సోమవారం మంగళగిరి బైపాస్ రోడ్‌లో గల సీఎన్ఆర్ ఫంక్షన్ హాల్లో జరిగిన కార్యక్రమంలో చెక్కులను పంపిణీ చేశారు.

పంచాయతీలకు విరాళంపై హర్షం

విశాలాంధ్ర- పెదకాకాని : ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్రంలో 400 పంచాయతీలకు ఒక్కో పంచాయితీకి లక్ష రూపాయలు చొప్పున తమ సొంత నిధులను వెచ్చించడం పట్ల పెదకాకాని మండల జనసేన నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పెదకాకాని మండలంలో 12కు గాను 11 గ్రామపంచాయతీలకు లక్ష రూపాయలు చొప్పున ఇచ్చారని మండల జనసేన పార్టీ అధ్యక్షులు వీరెల్ల వెంకటేశ్వర్లురావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పవన్ కళ్యాణ్ అధికారంలో లేని సమయంలో కూడా రైతులకు జనసేన పార్టీ తరఫున తన సొంత నిధులను రూ.30 కోట్లు అందజేశారని గుర్తుచేశారు. పొన్నూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు మారుతి కుమార్, పెదకాకాని గ్రామ పార్టీ అధ్యక్షుడు మండలం శ్రీనివాస్, మునగా కోటేశ్వరరావు, సీనియర్ నాయకులు బండారు అప్పారావు, బండారు శ్రీనివాస్, కొనా ప్రసాద్, సెక్రటరీలు దంతాల ఆంజనేయులు, రవి, మైనారిటీ నాయకులు జాకిర్ హుస్సేన్, బీసీ నాయకులు దూపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

వరద బాధితులను ఆదుకున్న టీడీపీ ఆచారి అండ్ టీం

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక 48వ డివిజన్ టీడీపీ కార్య కర్తలు ఆచారి అండ్ టీం విజయవాడలోని వాంబే కాలనీ, రాజరాజేశ్వరి పేట, సింగ్ నగర్, భవానీపురం తదితర ప్రాంతాలలో 10 వేల బిస్కెట్ ప్యాకెట్లు, పండ్లు, బ్రెడ్లు, వాటర్ బాటిళ్ళు పెద్ద ఎత్తున అందజేశారు. టీం నాయకులు పీవీఎల్ చారి మాట్లాడుతూ టీడీపీ 48వ డివిజన్ కార్యకర్తలుగా మంత్రి నారా లోకేష్ పిలుపు మేరకు వృత్తి రీత్యా కార్పెంటర్లమైన మేము స్పందించి ఉదారంగా వరద బాధితులకు చేయూతనందించామని తెలియజే శారు. కార్యక్రమంలో పీబీటీ చారి, జి.నారాయణ చారి, ఎస్.మహేశ్వర చారి, కె.లక్ష్మణచారి, జి. నరసింహారావు, ఎ.భాను ప్రకాష్, పెండెం నాని, వి.వెంకట్, వి.శీను, రవి తదితరులు పాల్గొన్నారు.

రూ.50 లక్షలు విలువైన అక్రమ మద్యం ధ్వంసం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఇటీవల కాలంలో గుంటూరు జిల్లాలో అక్రమ మద్యం రవాణా కేసుల్లో పలువురు వ్యక్తుల నుంచి స్వాధీనం చేసుకున్న సుమారు రూ.50 లక్షల విలువ చేసే 24,031 అక్రమ మద్యం బాటిల్స్‌ను గుంటూరు నగరం నల్లచెరువు డంపింగ్ యార్డులో బుల్డోజర్ ద్వారా ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల కాలంలో జరిగిన సాధారణ ఎన్నికల సమయంలో గుంటూరు జిల్లాలో అక్రమ మద్యం రవా ణా కేసుల్లో పలువురు వ్యక్తులను అరెస్ట చేసి రిమాండ్ పంపించడం జరిగిందని, వారి వద్ద నుంచి అక్రమ మద్యం స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ ఎస్పీ వెంకటేశ్వర రావు, ఈస్ట్ డివిజన్ ఇన్‌చార్జ్ డీఎస్పీ సుబ్బారావు, లాలపేట సీఐ శివప్రసాద్, నగరంపాలెం సీఐ మధుసూదనరావు, కొత్తపేట సీఐ వీరయ్య, తెనాలి సీఐ రమేష్ బాబు చౌదరి, నల్లపాడు సీఐ వంశీధర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ ఎ.శ్రీనివాస, డీసీఆర్బీ సీఐ బిలాలుద్దీన్, రాంబాబు, ఏఎస్సై వెంకటేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

CHANGE OF NAME

I, **KANDI ARUNAKUMARI** (Old Name), W/o. **Kandi Rami Reddy**, Resident of Door No.3-5, Bollavaram Village, Muppalla Mandal, Palnadu District - 522403, Andhra Pradesh. I have changed my name as **KANDI ARUNA** (New Name) W/o. **Kandi Rami Reddy**. Hereafter my name is known as **KANDI ARUNA** (New Name) W/o. **Kandi Rami Reddy.**

పాస్‌పోర్ట్ పోయినది

పల్నాడు జిల్లా, నాదెండ్ల మండలం, గణపవరం గ్రామం, డోర్ నెం.4-24-1రు కాపురస్తులు **షేక్ హుస్సేన్ గారి కుమారుడు షేక్ కాలీషావలి (సెల్: 8186953526)** అను నేను నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం. **R4562065** ఒరిజినల్‌ను గణపవరంలోని నా ఇంటి నుండి చిలకలూరిపేట (నాదెండ్ల పోలీసు స్టేషన్ పరిధి)కు వెళ్ళుచుండగా మార్గమధ్యలో పోగొట్టుకున్నాను. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

విశాలాంధ్ర

సైనికుల త్యాగాలతోనే నిశ్చింతగా ఉండగలుగుతున్నాం: ఎమ్మెల్యే జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: సరిహద్దుల్లో లక్షలమంది సైనికుల త్యాగాల ఫలితంగానే ఇక్కడ ప్రజలంతా గుండెలపై చేయి వేసుకుని నిశ్చింతగా ఉండగలుగుతున్నారని టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. దేశంలో టెరిటోరియల్ ఆర్మీ సేవలకు 75 వసంతాల సందర్భంగా 30 మంది జవాన్లతో జులై 30న జమ్ముకశ్మీర్ సియాచిన్ లోని గ్లేసియర్ బేస్ క్యాంపు నుంచి మొదలై అండమాన్ నికోబార్ దీవుల్లోని ఇందిరా పాయింట్ వరకు నిర్వహిస్తున్న సైకిల్ యాత్ర ఆదివారం వినుకొండ పట్టణానికి చేరుకుంది. ఈ క్రమంలో సోమవారం వినుకొండలో జవాన్లు సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక కారంపూడి రోడ్డులోని ఎన్ఎస్పీ కాల్వ వద్ద జవాన్ల సైకిల్ యాత్రను జెండా ఊపి ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, లీలావతి దంపతులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు ప్రారంభించారు. ఈ యాత్రలో పాల్గొన్న జవాన్లను ఎమ్మెల్యే దంపతులు అభినందించారు. బస్టాండ్, స్థూపం సెంటర్ మీదుగా లయోల పాఠశాల వరకు ర్యాలీ సాగింది. జవాన్లతో పాటు సైకిల్ తొక్కి జీవీ ఆంజనేయులు ఉత్సాహపరిచారు. పట్టణంలో సాగిన యాత్రలో పెద్దఎత్తున విద్యార్థులు, యువత, పట్టణ ప్రముఖులు పాల్గొన్నారు. యాత్రలో భాగంగా బృందం సభ్యులు లయోల పాఠశాలలో విద్యార్థులు, యువతతో ముఖాముఖి నిర్వహించారు. యాత్ర మార్గమధ్యలో వివిధ ప్రాంతాల్లో సుమారు 40 వేలమందికిపైగా మాజీ సైనికోద్యోగులు, వీర సైనికుల సతీమణులతో పాటు వివిధ పాఠశాలలు, కళాశాలలకు చెందిన విద్యార్థులు, యువతతో సమావేశం అవుతున్నారు. ఈ సందర్భంగా జీవీ మాట్లాడారు. భారతదేశ రక్షణ రంగంలో విశేష సేవలు అందిస్తూ 75ఏళ్ల వజ్రోత్సవ సందర్భానికి చేరువైన టెరిటోరియల్ సైన్యానికి మనస్ఫూర్తిగా శుభాకాంక్షలు, శుభాభినందనలు తెలిపారు. దేశానికి భద్రత కల్పిస్తూ రక్షణలో భాగం పంచుకుంటూ నిత్యం దేశాన్ని కాపాడుతున్న సైనికుల సేవలు ఎప్పటికీ మరిచిపోలేమన్నారు. ఇటీవల వయనాడ్ వరదల నుంచి విజయవాడ వరదల్లో సహాయ చర్యల వరకు వారి సేవలను మనం చూశామన్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ టెరిటోరియల్ ఆర్మీ దేశవ్యాప్తంగా చేపట్టిన ఈ యాత్ర వినుకొండకు రావడం సంతోషం అన్నారు. ఈ సందర్భంగా సైకిల్ యాత్ర బృందానికి నేతృత్వం వహిస్తోన్న మేజర్ రావత్ మాట్లాడుతూ లద్దాక్ మంచుకొండలు, ఎడారి ప్రాంతాలు సహా ఎన్నో దాటుకుంటూ ఈ సాహసభరితమైన యాత్ర సాగిస్తున్నామని తెలిపారు. తమ బృందాన్ని ఆహ్వానించడానికి పెద్ద ఎత్తున వచ్చిన ప్రజలు, చిన్నారులు, ఎమ్మెల్యే జీవీకి కృతజ్ఞతలు తెలిపారు. ఆర్మీ జవాన్లు మాజ్ రావాత్, మజ్ అబ్జీత్,మొత్తం 46 మంది ఆర్మీ జవాన్లు మరియు ఎంఈఓ జప్రుల్లాఖా, జనసేన్ పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త కొణిజేటి నాగ శ్రీను రాయల్, ఎక్స్ ఆర్మీ జవాన్ బొల్లేపల్లి వెంకటరావు, బిజెపి నాయకులు మేడా రమేష్,గీతాంజలి విద్యాసంస్థల డైరెక్టర్ ఎండ్లూరి లక్ష్మణ్ కిషోర్, పట్టణ పార్టీ అధ్యక్షుడు పఠాన్ అయిబ్ ఖాన్, లగడపాటి వెంకటరావు,పెమ్మసాని నాగేశ్వరరావు, వాసిరెడ్డి లింగ మూర్తి, రొద్దా వీరాంజనేయరెడ్డి, సౌదాగర్ జానీ భాష, గద్దె వీరా మస్తాన్ రావు, యరమాసు కోటేశ్వరరావు, పలు ప్రైవేట్ స్కూలు విద్యాసంస్థల డైరెక్టర్లు, పిటి మాస్టారులు, గాలి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

కిడ్స్ ఉపాధ్యాయులకు అరుదైన గౌరవం

విశాలాంధ్ర-మాచర్ల: ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఈ నెల 8న గుంటూరు గోరంట్లలోని కెనడీ నెక్స్‌జెన్ పాఠశాలలో ఏపీటీఎల్ఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షులు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన పాన్ ఇండియా ఐకానిక్ టీచర్ అవార్డు ప్రధానోత్సవంలో కిడ్స్ పాఠశాలకు చెందిన ఉపాధ్యాయులు హెచ్ఎం జీవీఎన్ రామకృష్ణ శాస్త్రి, ఎస్.పవన్ కుమార్, సిహెచ్ ఆనంద్ గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు చేతుల మీదుగా అవార్డులను అందుకున్నారు. ఈ సందర్భంగా హెచ్ఎం శాస్త్రి మాట్లాడుతూ తమ పాఠశాల నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఈ అవార్డుకు ఎంపికవడం సంతోషంగా ఉందన్నారు. అవార్డు గ్రహీతలను పాఠశాల యాజమాన్యం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గణేష్ విగ్రహ నిమజ్జనం

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : మాచర్ల మండలం బెల్లంకొండవారి పాలెం గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జన కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. విగ్రహం వద్ద భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వినాయకుడి విగ్రహాన్ని గ్రామ పురవీధుల్లో ఊరేగింపు జరిపారు. మహిళలు, యువకులు నృత్యాలు చేస్తూ గణేష్ ఊరేగింపులో సందడి చేశారు. గణేష్ విగ్రహాన్ని అనుపులోని కృష్ణాజలాశయంలో నిమజ్జనం చేశారు. ఈ కార్యక్రమంలో చిరుమామిళ్ల సుబ్బయ్య, గోపి, ధనుంజయరావు, పట్టికొండ నాగరాజు, కొల్లూరి వెంకట్రామయ్య, చిరుమామిళ్ల రంగనాయకులు, చిరుమామిళ్ల మల్లయ్య, చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు, శ్రీను, రంగనాయకులు, గంటా ధనుంజయరావు, శ్రీరామూర్తి, హనుమంతరావు, రమేష్, విజయ్ బాబు, బాజి, దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో రైతు మృతి

విశాలాంధ్ర-నూజెండ్ల : మండలంలోని దాట్లవారి పాలెంకు చెందిన రైతు మారెళ్ళ నాగిరెడ్డి(55) గుండెపోటుతో సోమవారం ఉదయం మృతి చెందాడు. కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం రైతు మారెళ్ళ నాగిరెడ్డి ఉదయాన్నే పొలానికి వెళ్లగా హఠాత్తుగా గుండెపోటు వచ్చి కుప్పకూలిపోవడంతో గమనించిన కుటుంబసభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లగా వైద్యులు మార్గమధ్యలో మృతి చెందినట్లుగా తెలిపారన్నారు. మృతునికి భార్య, కుమారుడు ఉన్నారు. నాగిరెడ్డి మరణంతో తమకు పెద్ద దిక్కును కోల్పోయామని కుటుంబసభ్యులు బోరున విలపిస్తున్నారు.

ఆలయంలో గౌతమ్ రెడ్డి పూజలు

విశాలాంధ్ర-విజయపురిసౌత్ : మాచర్ల మండలం చింతల తండా గ్రామంలో మహాలక్ష్మమ్మ పండుగను పురస్కరించుకుని మాచర్ల ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మారెడ్డి తనయుడు జూలకంటి గౌతమ్ రెడ్డి ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయానికి చేరుకున్న గౌతమ్ రెడ్డికి టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికారు. అనంతరం మాట్లాడుతూ మహాలక్ష్మమ్మ అమ్మవారి దీవెనలు తండా వాసులందరికీ ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు రమావత్ స్వామి నాయక్, రమావత్ చందన సింగ్ నాయక్, రమావత్ గోపి నాయక్, రమావత్ రవి నాయక్, రాజా నాయక్, వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

విశాలాంధ్ర-పిడుగురాళ్ల: పిడుగురాళ్లలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏఈ శివ నాగిరెడ్డి తెలిపారు.

విద్యార్థికి అభినందనలు

విశాలాంధ్ర-దుర్గి : ఉమ్మడి గుంటూరు జిల్లా స్థాయిలో గుంటూరులో ఆదివారం జరిగిన బాల్ బ్యాడ్మింటన్ సబ్ జూనియర్ విభాగంలో ఇంటర్ డిస్ట్రిక్ట్ బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు దుర్గి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 7వ తరగతి విద్యార్థి షేక్ భాష ఎంపికయ్యారు. ఈ విద్యార్థి 13 నుంచి 15వ తేది వరకు వెస్ట్ గోదావరి జిల్లా అన్నవరంలో జరిగే రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటాడు. ఈ సందర్భంగా రాష్ట్ర స్థాయిలో ఎంపికైనందుకు విద్యార్థికి, కోచింగ్ ఇచ్చిన పాఠశాల ఫిజికల్ డైరెక్టర్(పీడీ) బండ్ల ప్రసాద్‌ను సోమవారం పాఠశాల ప్రధానోపాధ్యా యులు పి.కోటేశ్వరమ్మ, పాఠశాల మేనేజ్మెంట్ కమిటీ చైర్మన్ శీలం గాలయ్య, పాఠశాల ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు అభినందనలు తెలియజేశారు.

పట్టణానికి నూతన శోభ

విశాలాంధ్ర-సత్తెనపల్లి : పట్టణంలో వీధి పేర్లతో బోర్డులు ఏర్పాటు చేయటంతో నూతన శోభను సంతరించుకున్నది. నియోజకవర్గ ఎమ్మెల్యేగా కన్నా లక్ష్మీనారాయణ గెలిచిన తరువాత పట్టణ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించారు. మాచర్ల సత్తెనపల్లి ప్రధాన రహదారిలోని ఫైర్ స్టేషన్ వద్ద సత్తెనపల్లి పురపాలక సంఘము పేరుతో స్వాగత బోర్డు ఏర్పాటు చేయించారు. పట్టణంలో కొత్త వ్యక్తులు వస్తే పలానా రోడ్డుకు వెళ్లాలని, అలాగే పలానా ఏరియా ఎక్కడ అంటూ అడిగే పని లేకుండా అందరికి అర్థమయ్యేలా ఏరియా పేర్లతో కూడిన నేమ్ బోర్డులను మున్సిపాలిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయించారు. ఇలా పట్టణానికి నూతన శోభ తెచ్చేందుకు కన్నా లక్ష్మీనారాయణ కృషి చేస్తున్నారు. నూతనంగా బోర్డులను ఏర్పాటు చేయటం పట్ల పట్టణ, గ్రామీణ ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

పాస్టర్లకు సన్మానం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: కుక్కపల్లె వారిపాలెం గ్రామంలోని నిరీక్షణ ప్రార్ధన మందిరంలో సోమవారం గాస్పెల్ యునైటెడ్ పాస్టర్స్ ఫెలోషిప్ 20వ వార్షికోత్సవం జరిగింది. ఈ సందర్భంగా ప్రత్యేక ప్రార్ధన సమావేశం నిర్వహించారు. యేసుక్రీస్తు దివ్య శాంతి నిలయం పాస్టర్ నందమూరి క్రిస్టర్ ప్రత్యేక సందేశం వినిపించారు. ఇందులో భాగంగా గత 20 ఏళ్లుగా ఫెలోషిప్ సాధించిన ఆధ్యాత్మిక విజయాలు గురించి పెద్దలు వివరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక పాస్టర్ సుబ్బారావు, ఫెలోషిప్ అధ్యక్షులు గుమ్మడి కొటేశ్వరావు, నూతలపాటి అబ్రహాము, నీలం థామస్ మెడిద శాంసన్‌తో పాటు నియోజకవర్గంలోని పలు గ్రామాలలోని చర్చిలలో సేవ చేస్తున్న పాస్టర్లు, మహిళ పాస్టర్లు పాల్గొన్నారు. సీనియర్ పాస్టర్లను సత్కరించారు.

దెబ్బతిన్న రోడ్లు పరిశీలన

విశాలాంధ్ర-అమరావతి : వర్షాలు వరదల కారణంగా అమరావతి మండల పరిధిలోని దెబ్బతిన్న డ్రైనేజీ, రోడ్లు, కాల్వలను అమరావతి మండల ప్రజా పరిషత్ అధికారిణి పావులూరి ఉమాదేవి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ధరణికోటలో వినాయక నిమజ్జనం స్థలాన్ని పరిశీలించిన అనంతరం బోటు ద్వారా ముత్తాయపాలెంలో డ్రైనేజీ, వివిధ రోడ్లను పరిశీలించారు. అనంతరం మండల పరిధిలోని దిడుగు గ్రామ ప్రాంతంలో ఉన్న కల్వర్టు డ్రైనేజీ పరిశీలించారు. దెబ్బతిన్న వాటిపై రాష్ట్ర ప్రభుత్వానికి నివేదిక ఇవ్వనున్నట్లు ఎంపీడీవో ఉమాదేవి తెలిపారు.

జీవీ, మక్కెన ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర-వినుకొండ: స్థానిక నిమ్మల బావి బజార్ లో శ్రీ కందుకూరి అంకమ్మ తల్లి దేవస్థానం తరుపున ముదురాజుల కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం వద్ద సోమవారం ఎమ్మెల్యే జివి ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావులు ప్రత్యేక పూజలు చేశారు. 5వ వార్షికోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన భారీ అన్నదాన కార్యక్రమాన్ని వారు ప్రారంభించారు. బత్తిక దానయ్య, ఒగ్గు శ్రీనివాసరావు, బత్తిక నరసింహారావు, రాఘవమ్మ, లక్ష్మీదేవి, జానకమ్మ, రామలక్ష్మి, మహిళా భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు అందజేశారు.

అడిగిన వారికి పని కల్పించాలి

విశాలాంధ్ర-దుర్గి : గ్రామాల్లో పని అడిగిన ప్రతిఒక్కరికీ జాబ్ కార్డ్ ఇచ్చి 100 రోజులు పని కల్పించే బాధ్యత ఫీల్డ్ అసిస్టెంట్లపై ఉందని అసిస్టెంట్ ప్రాజెక్టు అధికారి గంగనబోయిన చినవెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఉపాధి హామీ పథకం పనులు, వాటి విధివిధానాలపై ఫీల్డ్ అసిస్టెంట్లకు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టెక్నికల్ అసిస్టెంట్ వెంకటేష్ మాట్లాడుతూ పని మంజూరు కాగానే పని మొదలు పెట్టాలన్నారు. కొలతలు ప్రకారం పనిచేస్తే రూ.300 వేతనం వస్తుందని కూలీలకు చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో కంప్యూటర్ ఆపరేటర్ నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పౌష్టికాహార మాసోత్సవాలు

విశాలాంధ్ర-వినుకొండ: ఓబయ్య కాలనీ అంగనవాడి సెంటర్ నందు పౌష్టికాహారం మాసోత్సాల కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఓ ఎం.అనురాధ మాట్లాడుతూ పౌష్టికాహారంతో రక్తహీనత నివారించవచ్చని, ముఖ్యంగా గర్భిణీలకు బాలింతలకు ప్రభుత్వం పౌష్టికాహారం పంపిణీ చేస్తుందన్నారు. చిరుధాన్యాలు వాడకం అత్యవసరమని తెలిపారు. బిడ్డకు ఆరు నెలలు నిండిన తర్వాత తల్లిపాలతో పాటుగా పౌష్టికాహారం అందజేస్తారని, దీన్ని సద్వినియోగపరుచుకోవాలని సిడిపిఓ తెలిపారు. తల్లిదండ్రులు చిన్నపిల్లల ఆరోగ్యం పట్ల ప్రత్యేకమైన దృష్టి కనబరచాలని తెలిపారు. పుట్టిన పిల్లలకు డబ్బా పాలు కాకుండా తల్లిపాలు మాత్రమే ఇవ్వాలన్నారు. ఆకుకూరలు కూరగాయలు పండ్లు తీసుకోవాలన్నారు. కిశోర బాలికలకు ఏమైనా సమస్యలు ఉన్నట్లయితే తల్లిదండ్రులు ఏరియాలోని మహిళా పోలీస్‌కు లేదా అంగన్వాడీ కార్యకర్తకు తెలియజేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ జఫరుల్లా ఖాన్, అంగన్వాడి టీచర్లు ప్రసన్న, లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

గిడ్డంగి పైకప్పు రేకులు అపహరణ

విశాలాంధ్ర – కారంపూడి : మండలంలోని పేటసన్నెగండ్ల శివారులో నిర్మించిన గిడ్డంగి పైకప్పు రేకులు అపహరణకు గురైనట్లు సహకార పరపతి సంఘ (సొసైటి) కార్యదర్శి సాంబశివ రావు తెలిపారు. రైతులు పండించిన పంటలను భద్రపరచుకోనేందుకు, ఆర్బీకేల ద్వారా కొనుగోలు చేసిన పంటలను భద్రపరిచేందుకు మండలంలో రెండు గిడ్డంగులను 2020లో అనుమతులు లభించాయి. రెండు గిడ్డంగుల నిర్మాణానికి రూ 40 లక్షలు మంజూరయ్యాయి. గాదెవారిపల్లె గ్రామంలో నిర్మించిన గిడ్డంగి సంఘానికి అప్పగించగా, పేటసన్నె గండ్ల శివారులో నిర్మించిన గిడ్డంగి పూర్తి కాలేదు. దీంతో గిడ్డంగి పైకప్పు రేకులు అపహరణకు గరయ్యాయన్న విషయం బయటకు రావడంతో తిరిగి పైకప్పు రేకులను తీసుకువచ్చి గిడ్డంగిలో వేసి వెళ్లారు. ఈ సంఘటనపై స్థానిక పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సొసైటి కార్యదర్శి సాంబశివరావు తెలిపారు.

వడ్డెర్లపై వైసీపీ మూకల దాడి హేయం

విశాలాంధ్ర-మాచర్ల: వడ్డెర్లను టార్గెట్ చేస్తూ వైసీపీ మూకలు రెచ్చిపోతున్నాయని తెలుగుదేశం పార్టీ టౌన్ అధ్యక్షులు కొమెర దుర్గారావు ఆగ్రహం వ్యక్తం చేశారు. పట్టణంలోని 2వ వార్డులో కొంతకాలంగా వడ్డెర్లపై వైసీపీ మూకలు పలుమార్లు దాడులకు పాల్పడ్డారని, తాజాగా ఆదివారం రాత్రి మరో సారి దాడి చేయడాన్ని ఆయన ఖండించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీకి చెందిన వడ్డెర సామాజిక వర్గం యువతను పరుష పదజాలంతో దూషించుకుంటూ, దాడులకు తెగబడు తున్నారన్నారు. విషయాన్ని ఎమ్మెల్యే బ్రహ్మా రెడ్డి దృష్టికి తీసుకెళ్లి వడ్డెరలకు న్యాయం చేస్తామన్నారు. దాడి చేసిన వైసీపీ దుండగులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో నిరసనకు బైఠాయించిన వడ్డెర సామాజిక యువతకు సర్ది చెప్పి నిరసన విరమింపజేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు జడ్పీ విద్యార్థులు

విశాలాంధ్ర-శావల్యాపురం: ఉమ్మడి గుంటూరు జిల్లా బాలికల సబ్ జూనియర్ బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలలో శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన ఏడుగురు విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు అర్హత సాధించినట్లు పాఠశాల హెచ్ఎం బొడ్డపాటి విజయలక్ష్మి తెలిపారు. మండలంలోని స్థానిక జడ్పీ పాఠశాలలో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు అభినందన కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఈసందర్భంగా పిడి రాగుల రాధాకృష్ణ మూర్తి మాట్లాడుతూ ఈనెల 8వ తేదీన గుంటూరు ఎన్జీవో హెూం గ్రౌండ్ నందు జరిగిన ఉమ్మడి గుంటూరు జిల్లా జట్ల ఎంపికలలో శావల్యాపురం జడ్పీ పాఠశాలకు చెందిన విద్యార్థులు వేముల దివ్య, ముట్లూరి లుథియా, బందారు దేవమణి, రత్నకీర్తన, బందారు రవళి, ఉప్పు లలిత, చల్లా శ్రీహర్షితలు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనారని, వీరు తూర్పుగోదావరి జిల్లా అన్నవరంలో ఈనెల 13నుండి 15వ తేది వరకు జరిగే 9వ రాష్ట్ర స్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో పాల్గొంటారని తెలిపారు. రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపికైన విద్యార్థులను ఎస్ఎంసి చైర్మన్ పాటిబండ్ల శ్రవణ్, ఉపాధ్యాయులు బివి నాగేశ్వరరావు, భువనేశ్వరి, శ్రీనివాసరాజు, శ్రీకాంత్, గ్రామస్తులు అభినందించారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

విశాలాంధ్ర-యడ్లపాడు: మండలంలోని కొండవీడు గ్రామ సచివాలయంలో కోతముక్క ఆడుతున్న 11 మందిని యడ్లపాడు ఎస్ ఐ వి బాలకృష్ణ తన సిబ్బందితో సోమవారం పట్టుకొని వారి వద్ద నుంచి రూ.3,270లు స్వాధీనం చేసుకున్నారు. వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్తమ ఉపాధ్యాయునికి సత్కారం

విశాలాంధ్ర-దాచేపల్లి : నగర పంచాయతీ పరిధిలోని నడికూడి ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయులు బొల్లంపల్లి ఏసురత్నం పల్నాడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న విషయం విధితమే. దాంతో సోమవారం మదర్ స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు నాగేంద్ల సుమతీ రత్నం, కేసానపల్లి పంచాయతీ కార్యదర్శి నాగేంద్ల రత్నం, ఉపాధ్యాయులు చెట్టిపోగు ఏసురత్నం, నాగేంద్ల యేషయ్య తదితరులు ఆయనను ఘనంగా సన్మానించారు.

ఎట్టకేలకు ఎంపీపీ పదవి టీడీపీ కైవసం

విశాలాంధ్ర-దుగ్గిరాల : గతంలో ఎన్నో మలుపులు తిరిగిన ఎంపీపీ పదవి ఎట్టకేలకు టీడీపీ కైవసం చేసుకుంది. మండల కేంద్రమైన దుగ్గిరాలలో మండల పరిషత్ అధ్యక్ష పదవి చిలువూరు టీడీపీ ఎంపీటీసీ, వైస్ ఎంపీపీ షేక్ జబీన్‌కి దక్కింది. మంత్రి నారా లోకేష్ సారథ్యంలో జబీన్ సోమవారం ఇన్‌చార్జ్ ఎంపీపీగా పదవి బాధ్యతలు స్వీకరించారు. గత నెల 23న ఎంపీపీ పదవికి దానబోయిన సంతోష రూపవాణి రాజీనామా చేయడంతో ఖాళీ ఏర్పడింది. ఈ నేపథ్యంలో ఇన్‌చార్జ్ ఎంపీపీగా జబీన్‌ని కొనసాగించాలని ప్రభుత్వం ఉత్తర్వులు ఇవ్వడంతో జబీన్‌చే ఇన్‌చార్జ్ ఎంపీడీఓ పి.శ్రీనివాసరావు, ఏఓ డి.వీరయ్య ఎంపీపీగా కొనసాగాలని తెలిపారు. ఎంపీపీగా బాధ్యతలు స్వీకరించిన జబీన్‌కి ఎంపీడీఓ శ్రీనివాసరావు అభినందనలు తెలిపారు. ముందుగా ఎంపీపీ హాల్లో సంతకాల సేకరణ అనంతరం మండల నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పుష్పగుచ్ఛాలను అందించి జబీన్‌ను శాలువాలతో ఘనంగా సన్మానించి అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పోతినేని శ్రీనివాసరావు, కేశంనేని శ్రీఅనిత, గుడూరు వెంకట్రావు, వెనిగళ్ళ శ్రీకృష్ణ ప్రసాద్, తాళ్ల అశోక్ యాదవ్, పసుపులేటి సాయిచైతన్య, పుతుంబాకా సాయికృష్ణ, కొప్పుల మధుబాబు, విశ్వనాథంపల్లి శివకుమార్, మరీదు రాము, గేరా నిర్మల, రోజమరియమ్మ, బాణావత్ కుషిబాయ్, పాటిబండ్ల కృష్ణప్రసాద్, తాడిబోయిన రామకృష్ణ, నిజాముద్దీన్, జలాలుద్దీన్, షాదిక్, అంచా మారుతి ప్రసాద్, ఏళ్ల జయలక్ష్మి, గద్దిపాటి అపర్ణ, కొండూరు ముత్తయ్య, మెగావత్ శంకరనాయక్, ఎడ్ల సాయికృష్ణ, నాయుడు సీతయ్య, గండు కోటియాదవ్, ఏమినేని కోటేశ్వరరావు, జున్ను ఖాన్ పాల్గొన్నారు.

చంద్రబాబుపై కేసులు రాజకీయ కక్షతోనే: జీవీ

విశాలాంధ్ర-వినుకొండ: టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబుపై ఏడాది క్రితం ప్రతిపక్ష నేతగా ఉండగా నాటి జగన్ ప్రభుత్వం పెట్టిన కేసులన్నీ రాజకీయ ప్రేరేపితం, కక్షతోనే నని టీడీపీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అధర్మం తాత్కాలికంగా గెలవొచ్చు అంతిమ విజయం ఎప్పుడు ధర్మం వైపే ఉంటుందని, చంద్రబాబు అక్రమ అరెస్టుతో జగన్ అదే విషయాన్ని యావత్ దేశానికి చాటి చెప్పా రన్నారు. జగన్ ఎన్ని కుట్రలు చేసినా ఏ తప్పు చేయలేదు కాబట్టే చంద్రబాబు జైలు నిర్బంధాల నుంచే ఫీనిక్స్ పక్షిలా ఎగిసి మళ్లీ ముఖ్యమంత్రి సింహాసనం అందుకున్నారని తెలిపారు. 2023 సెప్టెంబర్ 9న నాటి వైకాపా ప్రభుత్వంలో చంద్రబాబు అర్ధరాత్రి అక్రమ అరెస్టుకు ఏడాది అయిన సందర్భంగా సోమవారం ఈ మేరకు పత్రికా ప్రకటన విడుదల చేశారు. కేవలం తనకు ప్రత్యర్థులు ఉండకూడదనే జగన్ ఆ రోజు తప్పుడు నిర్ణయంతో నిరంకుశంగా చంద్రబాబును అరెస్టు చేశారన్నారు.

అమర కళాకారుల సంస్మరణ సభలు

విశాలాంధ్ర-తెనాలి : అభ్యుదయ కళాసమితి, ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో అమర కళాకారుల సంస్మరణ సభలు ఈనెల 8వ తేదీ నుండి 19వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రజానాట్యమండలి గుంటూరు జిల్లా అధ్యక్షులు బొల్లిముంత కృష్ణ తెలిపారు. ప్రతిరోజు సాయంత్రం 5గంటల నుండి తెనాలి గాంధీనగర్ ఇస్కఫ్ కార్యాలయంలో జరుగుతాయని తెలిపారు. 8వ తేదీ డాక్టర్ గరికపాటి రాజారావు, 9వ తేదీన సుంకర, వాసిరెడ్డి, నార్ల చిరంజీవి, 10వ తేదీ తాతినేని ప్రకాశరావు, కె.ప్రత్యగాత్మ, 11వ తేదీ రక్తకన్నీరు నాగభూషణం, పెరుమాళ్ళు, కోడూరు అచ్చయ్య, కోగంటి, రూప శిల్పి కుమార్, 12వ తేదీ జంగాల సీతారామయ్య, యం.జె. మోహనరావు, 13వ తేదీ ఆచార్య ఆత్రేయ, 14వ తేదీ వీరమాచినేని సరోజిని, తాపీ రాజమ్మ, సౌమిత్రి, 15వ తేదీ సంగీత దర్శకులు సి.మోహన్‌దాస్, తాతినేని చలపతిరావు, బి.గోపాలం, జయదేవ్, ఆచార్యశ్రీ, 16వ తేదీ ఆంధ్రజాలరి సంపత్‌కుమార్, 19వ తేదీ తాపీ ధర్మారావు సంస్మరణ సభలతో కార్యక్రమాలు ముగుస్తాయని తెలిపారు.

బుద్ధిజం విద్యార్థికి నివాళి

విశాలాంధ్ర-మంగళగిరి : ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలోని బుద్ధిజం స్టడీస్ విభాగంలో ఎంఏ మొదటి సెమిస్టర్ అభ్యసిస్తున్న మయన్మార్ దేశానికి చెందిన విద్యార్థి కొండన్న మృతికి యూనివర్సిటీ సంతాపం తెలిపింది. సోమవారం విభాగంలో ఏర్పాటు చేసిన సంతాప సభకు విభాగాధిపతి ప్రొఫెసర్ ఎల్.ఉదయ కుమార్ అధ్యక్షత వహించారు. ఈ సభలో పాల్గొన్న వైస్ ఛాన్సలర్ ఆచార్య కె.గంగాధరరావు, ఇన్‌చార్జ్ రెక్టర్ ప్రొఫెసర్ కె.రత్న షీలా మణి, ఇన్‌చార్జ్ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జి.సింహాచలం, ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చల్లపల్లి స్వరూప రాణి, విదేశీ విద్యార్థుల విభాగం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ పి.పద్మావతి, దూరవిద్య కేంద్రం ఇన్‌చార్జ్ డైరెక్టర్ ప్రొఫెసర్ వంకాయలపాటి వెంకటేశ్వర్లు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఇన్‌చార్జ్ కోఆర్డినేటర్ డాక్టర్ దివ్య తేజ మూర్తిలు కొండన్న మృతికి నివాళులర్పించారు. కొండన్న మృతి బాధాకరమని ఆయన కుటుంబానికి తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేసి సంతాపం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో వికాసా కార్యదర్శి కావూరి శ్రీనివాసరావు, ఉద్యోగులు రాధాకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో అన్నదానం

విశాలాంధ్ర-మంగళగిరి : శ్రీ గంగా భ్రమరాంబ సమేత మల్లేశ్వరస్వామి వారి దేవస్థానంలో శ్రీ కాశి అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రతినెల అమావాస్య తర్వాత జరిగే అన్నదాన కార్యక్రమం సోమవారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు ప్రారంభించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్న ప్రసాదాన్ని స్వీకరించారు. సందర్భంగా ట్రస్ట్ చైర్మన్ పందేటి మాట్లాడుతూ భక్తుల సహకారంతో ప్రతి నెలలో అమావాస్య తర్వాత వచ్చే సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు పుప్పాల కోటే శ్వరరావు, ట్రస్ట్ ప్రతినిధులు కర్నాటి శివ సత్యనారా యణ, కాగ్గా శ్రీనివాసరావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, పాపిశెట్టి నాగరాజు, గండికోట అచ్చయ్య, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, గండికోట దుర్గారావు, రెడ్డి వీర రాఘవులు, దామర్ల వెంకటేశ్వర్లు, దొగిపర్తి శ్రీహరిరావు, గాయత్రి పరివార్ ప్రతినిధి పేర్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మానసిక ఒత్తిళ్లే.. ఆత్మహత్యలకు ఆస్కారం

- డబ్ల్యూహెచ్ఓ ప్రకారం ప్రతి ఏడాది ఒక మిలియన్ మంది ఆత్మహత్యతో మరణిస్తున్నారు
- ప్రతి సెకనుకు ఒక మరణం
- సగటున ప్రతి మూడు సెకన్లకు ఒక ఆత్మహత్య
- నేడు ప్రపంచ ఆత్మహత్యల నివారణ దినోత్సవం



విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : పెరుగుతున్న అధునాతన కాలంలో ఒకరికొకరు తక్కువగా మాట్లాడుకునే ఈ రోజుల్లో ఆత్మహత్యలు బాగా పెరుగుతున్నాయి. సగటున 1.71 లక్షల మంది ఆత్మహత్యలు 2022లో నమోదయ్యాయి. 2018తో పోలిస్తే 2022లో 4.2 శాతం ఆత్మహత్యలు ఎక్కువగా పెరిగాయి. డబ్ల్యూహెచ్ఓ ప్రకారం ప్రతి సంవత్సరం దాదాపు ఒక మిలియన్ మంది ప్రజలు ఆత్మహత్యతో మరణిస్తున్నారు. 20 రెట్లు ఎక్కువ మంది ఆత్మహత్యకు ప్రయత్నిస్తున్నారు. ప్రతి 40 సెకండ్లకు ఒక మరణం..సగటున ప్రతి మూడు సెకన్లకు ఒక ఆత్మహత్య ప్రయత్నం జరుగుతుంది.

ఆత్మహత్య ప్రయత్నం స్త్రీలలో ఎక్కువ. కానీ ఆత్మహత్య వల్ల మరణించే శాతం పురుషుల్లో ఎక్కువ. ఇది ఎక్కువగా 15 సంవత్సరాల నుంచి 39 సంవత్సరాల వయసు వారిలో జరుగుతున్నాయి. యుక్త వయసు వారిలో ఇటీవల కాలంలో ఆత్మహత్యల శాతం బాగా పెరిగింది.

1. ఆత్మహత్యకు గల కారణాలు : దిగులు..ఒత్తిడి..ఆర్థిక సమస్యలు.. కుటుంబ కలహాలు..చదువు..పరీక్షల్లో తప్పడం..ప్రేమలో ఓడిపోవడం లాంటి కారణాలతో యుక్త వయసు గలవారు ఎక్కువగా ఆత్మహత్యలకు పాల్పడటం నేడు పరిపాటయ్యింది.

2. ఆత్మహత్యల లక్షణాలు : ఎక్కువగా ఎవరితో మాట్లాడక పోవడం.. ఎక్కువగా చావు గురించి మాట్లాడటం.. తనకి సంబంధించిన విలువైన వస్తువులు వేరే వారికి ఇవ్వటం.. తమ ఆస్తి సంపద వేరే వారికి రాయడం.. వింతగా ప్రవర్తించటం.. సన్నిహితులతో చివరగా మాట్లాడటం.. ఎక్కువగా ఏడవటం వంటి లక్షణాలు ఆత్మహత్య చేసుకునే వారిలో కనిపిస్తాయి.

3. మత్తు పదార్థాలకు బానిస అవ్వటం : మత్తు పదార్థాలకు బానిస అవ్వటం అనేది వంశపారం పర్యంగా వచ్చే అవకాశాలు ఎక్కువ. కానీ ఖచ్చితంగా వస్తాయి అని మాత్రం కాదు. దీంతో పాటు పైన ఉన్న కారణాలు కలిపి ఆత్మహత్య చేసుకున్న అవకాశం పెరుగుతుంది. ఐపీసీ సెక్షన్ 309 ప్రకారం ఆత్మహత్య ప్రయత్నం అనేది నేరం. దీనికి చట్టరీత్యా శిక్షలు కూడా ఉన్నాయి. కానీ ఇటీవల వాటిని తీసేశారు. దీంట్లో మానసిక వైద్యుల కృషి చాలా ఉంది. దీని వలన ఆత్మహత్యలు చేసుకునే వారి సంఖ్య తెలుస్తుంది. వారి సమస్యలు తెలుసుకుని నివారించుటకు ప్రయత్నం చేయవచ్చు.

4. నివారణ చర్యలు : స్నేహితులు, కుటుంబ సభ్యులు, మానసిక వైద్యుల సాయంతో ఆత్మహత్యల నివారణను నిరోధించవచ్చు. అవగాహన కల్పించడంతో ఇది సాధ్యమవుతుంది. ఆత్మహత్యకు గల కారణాలను కనుగొని వాటిని పరిష్కరించాలి. వారు ఆ సమస్య నుంచి బయటపడే ధైర్యాన్ని వారికి కలుగజేయాలి. వారి మానసిక సమస్యను ఒక మానసిక వైద్యుల సాయంతో నయం చేయాలి. ఈ విధంగా ఆత్మహత్యలను నివారించవచ్చు. ఆత్మహత్యలు లేని సమాజంగా మనం మార్చవచ్చు. దీనికి స్నేహితులు, కుటుంబ సభ్యులు, వైద్యులు, సమాజం సహాయపడాలి. ఇతరుల సమస్యలను తెలుసుకుని వారికి చేయూతనిచ్చి వారు సంతోషంగా ఉండటానికి సహాయపడాలి.

అవగాహన కల్పించాలి..

కోట సురేష్ కుమార్, సీనియర్ మానసిక వైద్య నిపుణులు, గుంటూరు.

ఆత్మహత్యలు చేసుకునే ఆలోచన ఉన్న వారు ఓపెన్‌గా మాట్లాడగలిగితే ఆత్మహత్యలను తగ్గించవచ్చు. ఇటువంటి వారితో కమ్యూనికేషన్ ఎక్కువగా ఉండాలి. సమాజం, బంధువులు, స్నేహితులు వారితో మాట్లాడితే దాని నుంచి బయటపడొచ్చు. నేడు చదువు విషయంలో పిల్లలపై తల్లిదండ్రుల ఒత్తిడి ఎక్కువగా ఉంటుంది. తల్లిదండ్రులు సాధించలేని లక్ష్యాలను తమ పిల్లలు సాధించాలని ఆలోచనతో ఎక్కువగా వారిపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. ఆస్తులు తాకట్టపెట్టి నిన్ను చదివిస్తున్నప్పుడు చదవకపోతే ఎలా అని తమ పిల్లలపై ఒత్తిడి తీసుకురావడం.. దీంతో పిల్లలు డిప్రెషన్‌కు లోనై మార్కులు తక్కువగా వచ్చి భయపడి ఒత్తిడికి లోనయ్యి ఆత్మహత్యలు చేసుకోవడం జరుగుతుంది. నా ముఖం మీకు చూపించలేను నాన్న అని ఉత్తరం రాసి మరి ఆత్మహత్యలు చేసుకోవడం వంటి పరిణామాలు చూస్తున్నాం. ఈ నేపథ్యంలో తల్లిదండ్రులు తమ పిల్లలపై ఒత్తిడి చేయకుండా చూసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉంది.

వరద బాధితులకు అండగా 'బెస్ట్ ఆగ్రోలైఫ్ లిమిటెడ్'



విశాలాంధ్ర-గుంటూరు సిటీ: రాష్ట్రంలో వరద ముంపు బాధితులకు 'బెస్ట్ ఆగ్రో లైఫ్ లిమిటెడ్' సంస్థ అండగా నిలిచింది. ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎస్‌బివిఆర్ ప్రసాద్, రీజినల్ మేనేజర్స్ వడ్లమూడి శ్రీనివాసరావు, సాంబిరెడ్డి తదితరులు వరద బాధితుల కోసం సీఎం సహాయ నిధికి రూ.5లక్షలు విరాళం అందించారు. సీఎం చంద్రబాబు నాయుడుని సోమవారం కలిసి రూ.5లక్షల చెక్కును అందించారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వారిని అభినందించారు.

మూగజీవాలను పట్టించుకోండి

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : ఇటీవల కురిసిన వర్షాల కారణంగా మేత దొరక్క ఇబ్బందులుపడుతున్న మూగజీవాలను పట్టించుకోవాలని నేషనలిస్టు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ జమీల్ అహ్మద్ బేగ్ కోరారు. స్థానిక వెంగళాయపాలెంలో గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ ఏర్పాటు చేసిన గోశాలలో కొన్ని మూగజీవాలు మరణించగా, మరికొన్ని అనారోగ్యంతో బాధపడుతున్నాయని అన్నారు. తక్షణమే వాటి రక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఇటీవల తాను స్వయంగా గోశాలను పరిశీలించడం జరిగిందని తెలిపారు. గోశాలలో మూగజీవాలకు సరైన సంరక్షణ లేకపోవడం, దాణా లేక, వైద్యం అందక అనారోగ్యంతో మరణిస్తున్నట్లు గమనించినట్లు వెల్లడించారు. ప్రకృతి విపత్తుల నేపథ్యంలో మూగజీవాలపై జాలి చూపాలని కోరుతూ గుంటూరు మేయర్ కావటి మనోహర్ నాయుడుకు, గుంటూరు పశ్చిమ ఎమ్మెల్యే గళ్ళా మాధవి కార్యాలయంలో సోమవారం వినతిపత్రాలను అందజేయడం జరిగిందని తెలిపారు.

అండగా ఉంటాం: చదలవాడ

విశాలాంధ్ర-నరసరావుపేట: వరదలతో జనజీవనం అస్తవ్యస్తమైందనీ.. కానీ ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపడంలో కూటమి ప్రభుత్వం చిత్తుద్ధితో పని చేస్తోందని నరసరావుపేట ఎమ్మెల్యే డా.చదలవాడ అరవింద బాబు అన్నారు. ఇబ్రహీంపట్నం మండలం గుంటుపల్లి గ్రామంలో నిత్యావసర రేషన్ సరుకుల పంపిణీలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఇంటింటికీ వెళ్లి నిత్యావసర వస్తువులు పంపిణీ చేశారు. ఎలాంటి భయం వద్దని భరోసా ఇచ్చారు. ప్రతి ఒక్కరూ బాధలో ఉన్నారని అలాంటి వారికి ప్రభుత్వం అండగా ఉంటుందనే భరోసా ఇచ్చేలా ఉద్యోగులు సహాయక కార్యక్రమాల్లో పాల్గొనాలని సూచించారు.

బాల్య వివాహాలు అరికట్టాలి

విశాలాంధ్ర-దాచేపల్లి: సమాజంలో ఇంకా జరుగుతున్న బాల్య వివాహాలను కూడా పూర్తి స్థాయిలో అరికట్టడానికి తల్లిదండ్రులు సహకరించాలని సీడీపీఓ రుక్సానా సుల్తానా బేగం కోరారు. స్థానిక ఉన్నత పాఠశాలలో చదువుతున్న కిశోర బాలికలకు పోషకాహార మహోత్సవంలో భాగంగా సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రుక్సానా మాట్లాడుతూ పోషకాహారాల గురించి సమగ్రంగా వివరించారు. ఈ కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్టు పర్యవేక్షకులు వరలక్ష్మీ కుమారి, శ్రీలక్ష్మి, పీహెచ్ సీ పర్యవేక్షకులు లక్ష్మయ్య, సరస్వతి, అంగన్వాడీ కార్యకర్తలు మల్లీశ్వరి, నాగేంద్రం, అనురాధ, పద్మ, కమాల్బీ, సుమతితో పాటు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సీసపు గని పునఃప్రారంభించాలి

- అఖిలపక్ష పార్టీల డిమాండ్
- కృషి చేస్తానని ఎమ్మెల్యే హామీ

విశాలాంధ్ర-వినుకొండ: నియోజకవర్గంలోని బొల్లాపల్లి మండలం బండ్ల మోటు వద్ద మూసి వేసిన హిందుస్థాన్ జింక్ సీసపు గని కర్మాగారాన్ని తిరిగి పునః ప్రారంభించా లని సీపీఐ పల్నాడు జిల్లా కార్యదర్శి ఏ. మారుతి వరప్రసాద్ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. వినుకొండ పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమ వారం వినుకొండ ఏరియా కార్యదర్శి బూదాల శ్రీనివాస రావు అధ్యక్షతన జరిగిన అఖిలపక్ష సమావేశంలో మారుతి మాట్లాడుతూ వేలాదిమంది నిరుద్యోగులకు తిరిగి ఉద్యోగ వసతులు కల్పించే బండ్లమోటు జింక్ సీసపు కర్మాగారాన్ని తిరిగి పునః ప్రారంభించాలని ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు పూర్తిస్థాయిలో సహకరించి కేంద్ర పెద్దలతో మాట్లాడి కర్మాగారం ప్రారంభించగలరని ఆయనను కోరారు. అనంతరం అఖిలపక్ష సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జున రావు మాట్లాడుతూ నియోజకవర్గంలో వేలాదిమందికి ఉద్యోగ వసతులు కల్పించే సీసపు గని తిరిగి ప్రారంభించవలసిన ఆవశ్యకత ఉన్నదని అసెంబ్లీలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుతో మాట్లాడి ఎంపీలను కలుపుకొని కేంద్ర మంత్రులతో మాట్లాడి తప్పకుండా గని పునః ప్రారంభించడానికి తన వంతు కృషి చేస్తానని అఖిలపక్ష సమావేశంలో హామీ ఇచ్చారు. అలాగే బండ్లమోటు గనిలో పనిచేసిన పూర్వపు ఏఐటీయూసీ నాయకులు కామ్రేడ్ ఎం. హెచ్. ప్రసాద్, జయ రావు తదితరులు మాట్లాడుతూ బండ్లమోటు సీసపు గని మూసివేసిన నాటికే అప్పటికే 15 లక్షల టన్నుల సీసాన్ని ఉత్పత్తి చేసి ఉన్నదని గతంలో సీసం టన్ను 50వేల రూపాయలు ఉండగా ప్రస్తుతం దాని ధర లక్ష 50 వేలకు పెరిగిందని దీనివల్ల ప్రభుత్వానికి మంచి ఆదాయంతో పాటు అనేకమంది నిరుద్యోగులకు ఉద్యోగ వసతులు కలుగుతాయన్నారు. 2000 సంవత్సరంలో అప్పటి కేంద్ర ప్రభుత్వం ప్రవేటీకరణ విధానాల ఫలితంగా సీసపు గనిలో నష్టాలను చూపించి మూసివేశారని ఆయన అన్నారు. గని మూసివేసిన సమయంలో ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక కమ్యూనిస్టు పార్టీలు ప్రజా సంఘాలను కలుపుకొని అనేక పోరాటాలు ఉద్యమాలు చేశామన్నారు. బండ్లమోటు జింక్ కర్మాగారం పరిస్థితులన్నీ పూర్తి అవగాహనతో మాకు తెలుసునని దానిని పునఃప్రారంభిస్తే ఖచ్చితంగా లాభాల బాటలో నడుస్తుందని తప్పనిసరిగా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంతో మాట్లాడి గనిని ప్రారంభించి మండలంలోని నిరుద్యోగులకు ఉద్యోగ వసతులు కల్పించాలని వారు కోరారు. గతంలో కూడా అనేకమార్లు స్థానిక సీపీఐ నాయకులను ఏఐటీయూసీ నాయకులను రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కేంద్రం దృష్టికి తీసుకొచ్చామని కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ విధా నాల వల్ల దానిని పట్టించుకోలేదని ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం అయినా కల్పించుకొని వెంటనే పరిశ్రమను ప్రారంభించడానికి కృషి చేయాలని ఆయన కోరారు. సిపిఐ బొల్లాపల్లి మండల కార్యదర్శి పిన్నేబోయిన వెంకటేశ్వర్లు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఉలవలపూడి రాము, సిపిఎం నాయకులు హనుమంత రెడ్డి బొంకూరి వెంకటేశ్వర్లు, టిడిపి పట్టణ అధ్యక్షులు ఆయూబ్ ఖాన్, పత్తి పూర్ణ, ప్రజా సంఘాల నాయకులు విజయ్, ఆర్మీ నాయు డు, ఆర్. వందనం, షేక్ కిషోర్, ఎస్. సాంబయ్య, షేక్ మస్తాన్, కె. మల్లికార్జున, ఆర్టీసీ యూనియన్ నాయకులు సంజీవరావు, హబీబ్ భాషా, మాలపాడు బండ్ల మోటు మాజీ ఉద్యోగ సంఘాల నాయకులు సీసపు గనిని ప్రారంభించాల్సిన ఆవశ్యకతను తెలియజేశారు. బొల్లాపల్లి మండల గ్రామాల ప్రజలు, అఖిలపక్ష నాయకులు, సానుభూతిపరులు పాల్గొన్నారు.

సచివాలయ సిబ్బంది చురుగ్గా వ్యవహరించాలి : కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: ప్రకృతి విపత్తులు నెలకొన్నప్పుడు క్షేత్ర స్థాయిలో ఉండే గ్రామ/వార్డు సచివాలయాల సిబ్బంది చురుగ్గా పనిచేయాలని జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు పేర్కొన్నారు. సచివాలయ సిబ్బంది కార్యాలయాల్లో ప్రజలకు అందుబాటులో ఉన్నప్పుడే రాబోయే ప్రమాదాలను గుర్తించే అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో భారీ వర్షాలు కురిసిన గ్రామాల్లో ప్రజా సమస్యలపై స్పందించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సచివాలయ సిబ్బందిపై చర్యలు తీసుకోనున్నామన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు ఎప్పటికప్పుడు సచివాలయాలను తనిఖీ చేసి సిబ్బంది కార్యాలయ విధుల్లో క్రమం తప్పకుండా హాజరై, ప్రతి రోజూ మూడు పూటలా అటెండెన్స్ వేసేలా చూడాలని ఆదేశించారు. రానున్న రెండు రోజులూ వర్ష సూచనలున్న నేపథ్యంలో అధికారులంతా అప్రమత్తంగా వ్యవహరించాలని, వర్షం-వరద ప్రభావిత ప్రాంతాల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు నిర్వహించాలనీ ఆదేశించారు. ఇప్పటికే ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్ ల ద్వారా పరిస్థితిని మండల స్పెషల్ ఆఫీసర్లు పర్యవేక్షించాలన్నారు. సోమవారం స్థానిక కలెక్టరేట్ లోని బీ.ఆర్ అంబేడ్కర్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ పి.అరుణ్ బాబు ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 50 మంది అర్జీలు సమర్పించారు. అధికారులు ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత సమయంలోగా నిబంధనల ప్రకారం పరిష్కారాలు చూపాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ సూరజ్ ధనుంజయ్, డీఆర్వో వినాయకం, జిల్లా అధికారులు, డీఎల్డీవోలు తదితరులు పాల్గొన్నారు.

ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బియ్యం పంపిణీ

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : తీవ్ర వరదలకు గురై ఇబ్బం దిపడుతున్న విజ యవాడ నగరం 58వ డివిజన్ వడ్డెర కాలనీ ప్రజలకు ఏఐఎస్ఎఫ్ గుంటూరు జిల్లా సమితి ఆధ్వర్యంలో 300 కేజీల బియ్యాన్ని సోమవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు జాన్సన్ బాబు, శివారెడ్డి, ఉపాధ్యక్షులు బందెల నాసర్ జీ, సహాయ కార్యదర్శులు మస్తాన్, నాగభూషణ్, కోశాధికారి సాయికుమార్, యశ్వంత్, కార్తిక్, దుర్గా సాయి, అమర్నాథ్, డేవిడ్, కిరణ్, రంజిత్, సుధీర్ పాల్గొన్నారు.

స్టాక్ మార్కెట్లపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి

విశాలాంధ్ర-మంగళగిరి : మారుతున్న కాలానికి అనుగుణంగా పోటీ ప్రపంచంలో వస్తున్న మార్పులలో భాగంగా మేనేజ్‌మెంట్, ఎంబీఏ, కామర్స్ విద్యార్థులు స్టాక్ మార్కెట్, సెక్యూరిటీ మార్కెట్, కమోడిటీ మార్కెట్లపై అవగాహన పెంచుకోవాలని విశ్వవిద్యాలయ ఇన్‌చార్జ్ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ కె.గంగాధరరావు పేర్కొన్నారు. విశ్వవిద్యాలయంలోని అంతర్జాతీయ వ్యాపార అధ్యయన విభాగం ఆధ్వర్యంలో రెండు రోజులపాటు సెక్యూరిటీస్ మార్కెట్స్ ప్రత్యామ్నాయ పెట్టుబడులు అనే అంశంపై శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న వైస్ ఛాన్సలర్ మాట్లాడారు. విద్యార్థి దశ నుంచే చిన్న మొత్తాలలో సెక్యూరిటీ మార్కెట్లలో ఇతర ప్రత్యామ్నాయ మార్గాలలో పెట్టుబడులు పెట్టే విధంగా ముందుకెళ్లాలని సూచించారు. విభాగాధిపతి ఆచార్య వి.చంద్రశేఖర రావు మాట్లాడుతూ నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీ మార్కెట్, విప్రుతి క్యాపిటల్ కంపెనీలు సంయుక్తంగా రెండు రోజుల శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు ఉచితంగా నిర్వహిస్తున్నారని రోజుకు ఐదు గంటలు చొప్పున సెబి సర్టిఫైడ్ ఫైనాన్షియల్ ప్లానర్, ట్రైనర్ జి.రాజశేఖర్ రెడ్డి తరగతులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో విభాగం సహాయ ఆచార్యులు డాక్టర్ ఎన్.ప్రసన్నకుమార్, అతిథి అధ్యాపకులు డాక్టర్ విజయవాణి, డాక్టర్ ఉమ, డాక్టర్ జాకీర్ హుస్సేన్, డాక్టర్ రాజశేఖర్, డాక్టర్ శ్యామలాదేవి, విద్యార్థులు పాల్గొన్నారు.

మాగులూరి ఫౌండేషన్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే

విశాలాంధ్ర-సత్తెనపల్లి రూరల్: మాతా, శిశు సంరక్షణకు మాగులూరి ఫౌండేషన్ అందిస్తున్న సేవలు అభినందనీయమని శాసనసభ్యులు కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం సత్తెపల్లి మండల పరిధిలోని ఫణిదం గ్రామంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. గ్రామీణ ప్రాంతాల్లో గర్భిణీలకు పౌష్టికాహారం అందజేసి అందజేసి వారిలో రక్తహీనత పోగొట్టేలా చేయడం మంచి పరిణామన్నారు. సత్తెనపల్లి, పెదకూరపాడు నియోజకవర్గాల్లో విద్య, వైద్యం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు ఎన్నారైలు ముందుకు రావడం శుభ పరిణామన్నారు. మాగులూరి భాను ప్రకాష్ ఆధ్వర్యంలో మరిన్ని మంచి కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. ఫణిదం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సేవల పరంగా ముందుండాలన్నారు. ఆసుపత్రికి ఏ అవసరం వచ్చినా నేనుంటాను. ఏ క్షణంలోనైనా నన్ను వైద్యులు, సిబ్బంది సంప్రదించవచ్చున్నారు. గ్రామీణ ప్రజలకు మెరుగైన వైద్య సేవల్ని అందించాలన్నారు. గ్రామ నాయకులు, ప్రజలు వరద బాధితులకు అరవై వేల రూపాయలు సీఎం సహాయనిధికి కన్నా లక్ష్మీ నారాయణ చేతుల మీదుగా అందించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లోని నాయకులు , కార్యకర్తలు పాల్గొన్నారు.

తైక్వాండో పోటీలకు విద్యార్థిని ఎంపిక

విశాలాంధ్ర-తెనాలి : స్థానిక చెంచుపేట యూనిక్ తైక్వాండో అకాడమీకి చెందిన ఇద్దరు క్రీడాకారులు ఈ నెల చిత్తూరు జిల్లా తిరుపతి నేషనల్ సాంస్క్రిట్ యూనివర్సిటీలో జరిగిన రెండవ ఖేలో ఇండియా ఉమెన్ తైక్వాండో రాష్ట్రస్థాయి పోటీలో పాల్గొన్నారు. వీరిలో ఒకరు ఉత్తమ ప్రతిభ కనబరచి జాతీయస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఎంపికైన ఈ క్రీడాకారిణి ఏ.వినూత్న 63 కేజీలు జూనియర్ కేటగిరీలో ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు జరిగే తమిళనాడులోని దిండిగల్ ఇండోర్ స్టేడియంలో పాల్గొననున్నట్లు కోచ్ బట్టు నాగరాజు తెలియజేశారు. ఈ క్రీడాకారిణి గత తొమ్మిది సంవత్సర కాలం నుంచి తైక్వాండో సాధన చేస్తుందని అనేకసార్లు జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో తైక్వాండో పోటీలలో పాల్గొని పతకాలు సాధించిందని అకాడమీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు నాగరాజు తెలియజేశారు. ఈ క్రీడాకారిణిని అకాడమీ గౌరవాధ్యక్షులు అందె బాలచంద్రమౌళి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు : రాంబాబు

విశాలాంధ్ర, విజయవాడ (గాంధీనగర్) : ప్రయాణీకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించి నాణ్యత సేవలు అందించి ఆహ్లాదకరమైన ప్రయాణ అనుభవాన్ని పొందే విధంగా కృషి చేస్తున్నామని సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ వావిలపల్లి రాంబాబు తెలిపారు. సోమవారం భీమవరం జంక్షన్-టౌన్ స్టేషన్‌లలో విస్తృతమైన తనిఖీలు చేశారు. సౌకర్యాలపై ప్రయాణీకుల నుండి అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పార్శిల్ కార్యాలయం, బుకింగ్ కార్యాలయం, ప్రయాణీకుల సౌకర్యాలు, వెయిటింగ్ హాల్స్,క్యాటరింగ్ స్టాల్స్‌ను తనిఖీ చేశారు. ఆయన వెంట ఎడిఎన్ ఎ.శంకర్, సీసీఐ ప్రదీప్,స్టేషన్ మేనేజర్ కె.శ్రీనివాస్,ఎస్.ఎస్.వి.చక్రవర్తి పాల్గొన్నారు.

వరదబాధితులకు వస్తువుల వితరణ

విశాలాంధ్ర-అవనిగడ్డ : జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రామ్ కమిటీ ఆధ్వర్యంలో వరద బాధితులకు సాయం అందించారు. ఆదివారం రాత్రి జనసేన పార్టీ రాష్ట్ర ప్రోగ్రామ్ కమిటీ ప్రధాన కార్యదర్శి మండలి దయాకర్, ఆర్గనైజింగ్ కార్యదర్శులు కొట్టె వెంకటేశ్వర్లు, ననకా దుర్గాప్రసాద్, నెల్లూరు పట్టణ జనసేన పార్టీ అధ్యక్షులు మహేంద్ర, టి సుజయ్, శ్రీకాంత్, సుందర రామిరెడ్డి ఆధ్వర్యంలో 1100 మంది వరద బాధితులకు రూ.3 లక్షల విలువ గల దుప్పట్లు, చీరలు, స్నాక్స్ రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర, ఎం.పి బాలశౌరి, శాసనసభ్యులు మండలి బుద్ధప్రసాద్, నియోజకవర్గ యువనాయకులు మండలి వెంకట్రామ్, జనసేన పార్టీ మచిలీపట్నం నియోజకవర్గ ఇన్‌చార్జ్ బండి రామకృష్ణ, జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు మత్తి వెంకటేశ్వరరావు వరద బాధితులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి,జనసేన, బీజేపీల నేతలు తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్యంలోపంతో విషజ్వరాలు

విశాలాంధ్ర-ఏ కొండూరు : మండలం లోని చీమలపాడు గ్రామ పంచాయతీలో పారిశుధ్యం లోపించి డ్రైనేజ్‌లో నీరు పొంగి ప్రవహిస్తుంది అనీ దాని వల్ల ప్రజలు విషజ్వరాల భారిన పడుతున్నరని చీమల పాడు టీడీపీ గ్రామ పార్టీ అధ్యక్షుడు బెజవాడ శంకర్ ఆరోపించారు. స్థానిక పత్రిక విలేకరులతో మంగళ వారం శంకర్ మాట్లాడుతూ గ్రామంలో అంతర్గత రహదారులలో డ్రైనేజీ వ్యవస్థ సరిగా లేక మురుగునీరు రోడ్లపై పొంగి ప్రవహిస్తూ ఉందన్నారు. స్థానికంగా ఉన్న సచివాలయంలో పంచాయతీ కార్యదర్శికి డ్రైనేజీ విషయమై పలుమార్లు చెప్పిన కనీసం స్పందించడం లేదని గ్రామ ప్రజలు సరైన డ్రైనేజీ వ్యవస్థ లేక విష జ్వరాల బారిన పడుతున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మండల ముస్లిం మైనార్టీ నాయకులు షేక్ ఆదం షరీఫ్ తిరువూరు నియోజకవర్గ టీడీపీ అధికార ప్రతినిధి మేకల రామారావు చీమలపాడు గ్రామ పార్టీ ప్రధాన కార్యదర్శి జంగా కిషోర్ పాల్గొన్నారు.

వరద బాధితులకు ఆర్థిక సాయం

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వరద కారణంగా సర్వస్వం కోల్పోయిన ప్రజలను ఆదుకునేందుకు సిద్దార్థ వైద్య కళాశాల పూర్వ విద్యార్థులు ముందుకువచ్చారు. వరద బాధితుల సహాయార్థం సిద్ధార్ద మెడికల్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అల్యూమినీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి సహాయ నిధికి రూ. 15 లక్షల విరాళం అందజేశారు. ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ రావులతో కలిసి సోమవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడును కలిసిన అల్యూమినీ ప్రతినిధులు.. రూ. 15 లక్షల చెక్కును సీఎంకు అందించారు. సిద్ధార్థ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల దాతృత్వం అభినందనీయమని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. అల్యూమినీ ఆధ్వర్యంలో వరద బాధితులకు పంపిణీ చేస్తున్న కిట్ల గురించి ఆయన ఆసక్తిగా అడిగి తెలుసుకున్నారు. మొత్తం కుటుంబానికి అవసరమైన చీర, పంచె, టవల్, దుప్పటి తదితర వస్తువులను అందజేస్తున్నట్లుగా తెలుసుకుని, మిగతా దాతలు సైతం ఈ తరహా కిట్లను అందజేస్తే బాధితులకు అత్యంత ఉపయుక్తంగా ఉంటుందని అన్నారు. సిద్ధార్థ వైద్య కళాశాల పూర్వ విద్యార్థుల అల్యూమినీ ప్రెసిడెంట్, సెక్రటరీలు డాక్టర్ సూరపనేని శ్రీనివాస్, డాక్టర్ నలమాటి అమ్మన్న ఈ సందర్భంగా మాట్లాడుతూ, విపత్తు సమయాల్లో ప్రజలకు ఆపన్న హస్తం అందించేందుకు తాము ఎల్లప్పుడూ ముందుంటామని అన్నారు. వరద బాధిత కుటుంబాల కోసం ఇప్పటి వరకు 500 రిలీఫ్ కిట్లను అందజేశామని చెప్పారు. వచ్చే రెండు రోజుల్లో మరో 1500 మందికి రిలీఫ్ కిట్లను అందజేయనున్నట్లు తెలిపారు. సిద్ధార్థ మెడికల్ కాలేజ్ ఓల్డ్ స్టూడెంట్స్ అల్యూమినీ జాయింట్ సెక్రటరీ డాక్టర్ వరప్రసాద్, మహిళా ప్రతినిధి డాక్టర్ అనురాధ పాల్గొన్నారు.

బాధితులకు కూరగాయల పంపిణీ

విశాలాంధ్ర-ఏ కొండూరు : ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పిలుపుమేరకు వరద ప్రభావిత ప్రజలకు కూరగాయల పంపిణీ చేసిన తిరువూరు నియోజకవర్గ జనసైనికులు. సోమవారం వరద బాధితుల సహాయార్థం ఏ కొండూరు నుంచి 300 మంది వరద బాధితులకు ఆరు క్వింటాళ్ళ, కూరగాయలు పంపిణీ చేశారు. కొండపల్లి వద్ద శాంతినగర్ వరద ముంపు బాధిత కుటుంబాలకు కూరగాయల పంపిణీ చేసిన తిరువూరు నియోజకవర్గ జనసైనికులు. తిరువూరు నియోజకవర్గ జనసేన పార్టీ సమన్వయకర్త మనుబోలు శ్రీనివాసరావు, ఉమ్మడి కృష్ణాజిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షులు బొలియాశెట్టి శ్రీకాంత్, జనసేన సీనియర్ నాయకులు అప్పికట్ల కుమార్, గంపలగూడెం మండల జనసేన పార్టీ అధ్యక్షులు చింతలపాటి వెంకట కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షా శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-చల్లపల్లి : బోలెం భాస్కరరావు ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్ సాయి దుర్గా : కంటి హాస్పటల్ వారిచే రామానగరంలో జరిగిన ఉచిత నేత్ర పరీక్షా శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు 200 మందికిపైగా నేత్ర సమస్యలున్నవారికి డాక్టర్ పూషడపు రామారావు పరీక్షలు నిర్వహించి ఉచితంగా ఐ డ్రాప్స్, మందులను అందచేశారు. ఐఓఎల్ ఆపరేషన్లు అవసరమైన వారిని గుర్తించారు. ట్రస్ట్ నిర్వాహకులు బోలెం రామారావు, బోలెం నాగమణి పర్యవేక్షణలో జరిగిన శిబిరాన్ని ఎంపీపీ కోట విజయ రాధిక, పైడిపాముల స్వప్న, పుప్పాల వీరాంజనేయులు, మోర్ల శివ, బి.కనకదుర్గ తదితరులు సందర్శించారు.

వరద ప్రభావిత వాహనాలకు నిస్సాన్ సమగ్ర మద్దతు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): వివిధ ప్రాంతాలలో సుదీర్ఘ వరదల దృష్ట్యా వరదల వల్ల పాడయి, ప్రభావితమైన వాహనాలకు నిస్సాన్ మోటార్ ఇండియా ప్రై. లిమిటెడ్ సమగ్ర సహాయక చర్యలను అందించనున్నట్టు నిస్సాన్ మోటార్స్ డైరెక్టర్ సౌరభ్ వత్స తెలిపారు. తమ వినియోగదారులకు ఈనెల 30 వరకు ఈ సహాయ సేవలు అందుబాటులో ఉంటాయన్నారు. వరద ప్రభావిత వాహనాలతో వినియోగదారులకు సహాయం చేయడానికి నిస్సాన్ ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసింద న్నారు. బాధిత వాహనాలను సమీపంలోని అధీకృత నిస్సాన్ సర్వీస్ వర్క్‌షాప్‌కు లాగడంతో సహా ఉచిత రోడ్‌సైడ్ అసిస్టెన్స్ (ఆర్ఎస్ఏ) సేవలను కంపెనీ అందిస్తుందన్నారు. అదనంగా, వరద-ప్రభావిత వాహనాలకు రూ. 1000 వరకు బీమా క్లెయిమ్ ప్రాసెస్ ఫీజు మినహాయింపును అందించడానికి నిస్సాన్ దాని డీలర్‌లతో సహకరిస్తోందన్నారు. ఈ చొరవ తమ బీమా క్లెయిమ్‌లను సెటిల్ చేయాలనుకునే కస్టమర్‌లపై ఆర్థిక భారాన్ని తగ్గించడం లక్ష్యంగా పెట్టుకుందన్నారు. నిస్సాన్ మోటార్ ఇండియా ఇంజిన్ ఆయిల్, ఆయిల్ ఫిల్టర్ రీప్లేస్‌మెంట్స్‌పై పది శాతం ప్రత్యేక ఆఫర్, ఫ్లోర్ కార్పెట్ రీప్లేస్‌మెంట్స్‌పై పది శాతం ప్రత్యేక ఆఫర్, అన్ని వరద ప్రభావిత వాహనాల కోసం అధీకృత సర్వీస్ వర్క్‌షాప్‌లలో వివరణాత్మక వాహన ఆరోగ్య తనిఖీని అందిస్తోందన్నారు. ఈ నెలలోపు అందించిన సేవల కోసం అధీకృత సర్వీస్ వర్క్‌షాప్‌లలో ఈ ప్రత్యేక ఆఫర్ అందుబాటులో ఉంటుందని చెప్పారు.

షావోమీ ఇండియా బ్రాండ్ అంబాసిడర్‌గా కత్రినా కైఫ్

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్), విజయవాడ: తన ఆవిష్కరణలతో గుర్తింపు దక్కించుకున్న గ్లోబల్ టెక్నాలజీ బ్రాండ్ షావోమీ ఇండియా, దిగ్గజ నటి కత్రినా కైఫ్‌తో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని ప్రకటించింది. షావోమీకి చెందిన విభిన్న శ్రేణి స్మార్ట్‌ఫోన్‌లు, టీవీలు, టాబ్లెట్‌లకు కైఫ్ బ్రాండ్ అంబాసిడర్‌గా వ్యవహరిస్తారు. షావోమీ భారతదేశంలో ఒక దశాబ్దాన్ని విజయ వంతంగా ఆచరించుకుంటున్న నేపథ్యంలో ఈ ప్రకటన ప్రతి ఒక్కరికీ షావోమీ అచంచలమైన ఆవిష్కరణల నిబద్ధతకు నిదర్శ నంగా నిలుస్తుందని షావోమీ ఇండియా చీఫ్ మార్కెటింగ్ ఆఫీసర్ అనూజ్ శర్మ పేర్కొన్నారు. ఇది కత్రినా గ్లోబల్ అప్పీల్, ఆకర్షణీ యమైన సౌందర్య సారాంశాన్ని సంపూర్ణంగా సంగ్రహిస్తుం దన్నారు. కత్రినా కైఫ్ మాట్లాడుతూ షావోమీతో కలిసి పని చేసేందుకు తిరిగి వచ్చినందుకు సంతోషంగా ఉన్నానని తెలిపారు.

టాటా ప్లేలో ఎందరో మహానుభావులు

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): సరికొత్త సెలబ్రిటీ టాక్ షో, 'ఎందరో మహానుభావులు' కార్యక్రమాన్ని టాటా ప్లే తెలుగు క్లాసిక్స్ ప్రసారం చేస్తోంది. నటుడు, రచయిత, దర్శకుడు పరుచూరి గోపాల కృష్ణ, జాతీయ చలనచిత్ర అవార్డు గ్రహీత నటి శారద, నటుడు, నిర్మాత, రాజకీయ నాయకుడు మురళీ మోహన్, దర్శకుడు, సినీ కథా రచయిత రేలంగి నరసింహారావు, తనికెళ్ల భరణి వంటి తెలుగు ఇండస్ట్రీ ప్రముఖులు, దిగ్గజాలు తమ వృత్తి జీవిత ప్రయాణాన్ని ఈ చాట్ షోలో వీక్షించవచ్చు. ఈ చాట్ షోకు ప్రముఖ తెలుగు నేపథ్య గాయని, డబ్బింగ్ కళాకారిణి సునీత ఉపద్రష్ట వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్నారు. విలక్షణమైన ఈ కార్యక్రమంలో తెలుగు చలనచిత్ర పరిశ్రమలోని ప్రముఖులు తమ నైపుణ్యాలు, అనుభవాలు, జీవితంలోని ఎత్తుపల్లాల గురించి మాట్లాడతారు. ఈ కార్యక్రమం ప్రతి శని, ఆదివారాలు రాత్రి 7:30 నుంచి 8:00 వరకు కొత్త ఎపిసోడ్‌లను టాటా ప్లే తెలుగు క్లాసిక్స్ ప్రసారం చేస్తుంది.

వృద్ధాశ్రమానికి నిత్యవాసరాలు అందజేత



విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్) : ముంపుకు గురైన వాంబేకా లనీలోని వృద్ధాశ్రమానికి బీఆర్‌టీయస్ వాకర్స్ క్లబ్ మానవత్వం చాటారు. జిల్లా వాకర్స్ క్లబ్ గవర్నర్ డాక్టర్ చిన్నం రామకృష్ణ పిలుపు మేరకు వైస్ ప్రెసిడెంట్ వీరంకి గోకర్ణేశ్వరరావు రూ.16వేల నిత్యావసర వస్తువులు తొలి విడతగా అందించారు. వృద్ధాశ్రమానికి అండగా ఉండాలని, ప్రతి ఒక్కరూ వృద్ధాశ్రమానికి సాయం చేయాలని పిలుపునిచ్చారు. డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంత్ కుమార్ దాతలను అభినందించారు. రీజియన్ కార్యదర్శి కొండాయగుంట రాము, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

అత్యాధునిక వైద్య చికిత్స

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): అత్యాధు నిక వైద్య సేవలను ప్రజలందరికీ అందించాలనే లక్ష్యంతో కృషి చేస్తోన్న అను హాస్పిటల్స్‌లో ఇటీవల అత్యంత సంక్లిష్టమైన, అరుదైన చికిత్సను నిర్వహించారు. విపరీతమైన కడుపు నొప్పితో బాధపడుతున్న ఓ వ్యక్తికి ఎటువంటి కోతలు, గాట్లు లేకుండా అత్యాధునిక ఎండో వాస్కులర్ విధానంలో చికిత్సనందించారు. అను హాస్పిటల్స్‌లో నిర్వహించిన ఈ అత్యాధునిక చికిత్స గురించి తెలియజేసేందుకు సోమవారం మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. సూర్యారావుపేటలోని అను హాస్పిటల్స్‌లో జరిగిన ఈ సమావేశంలో అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ జి. రమేష్ మాట్లాడుతూ.. అత్యాధునిక విధానంలో చికిత్సనందించి తమ హాస్పిటల్స్ కీర్తి ప్రతిష్టలను ఇనుమడింపజేసిన ఎం. డాక్టర్ భవానీశంకర్‌కు అభినందనలు తెలియజేశారు. మెట్రో నగరాల్లోని హాస్పిటల్లకు మాత్రమే పరిమితమైన ఈ తరహా సంక్లిష్టమైన చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసిన డాక్టర్ ఎం. భవానీ శంకర్.. మన రాష్ట్ర వైద్య చరిత్రలో నూతన శకాన్ని ఆవిష్కరించారని ప్రశంసించారు. అనంతరం, ప్రముఖ ఇంటర్వెన్షనల్ రేడియాలజిస్ట్ డాక్టర్ ఎం. భవానీశంకర్ మాట్లాడుతూ.."ఒడిశా రాష్ట్రానికి చెందిన 55 ఏళ్ల వ్యక్తి గత కొంత కాలంగా తీవ్రమైన కడుపు నొప్పితో బాధపడుతున్నారు. అవసరమైన పరీక్షలు నిర్వహించి, రోగి ఆరోగ్య సమస్యను నిర్ధారించాం. గుండె నుంచి శరీర భాగాలకు రక్తాన్ని సరఫరా చేసే ప్రధాన రక్తనాళం (అయోర్ట) ఉదర భాగంలో అసాధారణ స్థాయిలో ఉబ్బిపోయింది. ఈ సమస్యకు చికిత్స అందించకుండా నిర్లక్ష్యం వహిస్తే, రక్తనాళం చిట్లిపోయి ప్రాణాపాయం సంభవించవచ్చు. అను హాస్పిటల్స్‌లోని అత్యాధునిక ఇంటర్వెన్షనల్ రేడియాలజీ విభాగం ద్వారా రోగికి ఎండో వాస్కులర్ ఎన్యురిస్మల్ రిపేర్ అనే చికిత్సను నిర్వహించారు. పూర్తిగా ఎండో వాస్కులర్ విధానంలో ఎటువంటి కోతలు, గాట్లు లేకుండా ఈ చికిత్సను పూర్తి చేశాం. చికిత్స అనంతరం రోగి వేగంగా కోలుకుని, తీవ్రమైన కడుపు నొప్పి నుంచి ఉపశమనం పొందారు" అని తెలిపారు. ఈ సమావేశంలో అను గ్రూప్ ఆఫ్ హాస్పిటల్స్ డైరెక్టర్ డాక్టర్ కె. శ్రీదేవి, అనస్థీషియన్ డాక్టర్ వై. గోవర్ధని తదితరులు పాల్గొన్నారు.

ముంపు కోరల్లో ఉప్పుటేరు పరివాహ గ్రామాలు

విశాలాంధ్ర-కృత్తివెన్ను : కొల్లేరు నుండి ఉప్పుటేరు ద్వారా నీరు దాదాపు 25 కిలోమీటర్ల దూరం ప్రయాణించి చినగొల్లపాలెం వద్ద సముద్రలో కలుస్తుంది. ఉప్పుటేరు ప్రవాహ సామర్థ్యం 20 వేల క్యూసెక్కులు కాగా ఆక్రమణలతో దీని సామర్థ్యం నేడు 5 నుండి 8 వేల క్యూసెక్కులకు తగ్గిపోయింది. దీంతో ఒక్కసారిగా వరద నీరు ఉప్పుదేరులో ప్రవేశిస్తే పరివాహ గ్రామాలు వరద బారిన పడే అవకాశాలు న్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఉప్పుటేరు పరివాహంలో ఒకవైపు పశ్చిమగోదావరి మరోవైపు కృష్ణాజిల్లా సరిహద్దులుగా ఉన్నాయి. ఆకివీడు, కొండంగి, ఏర్లుపాడు, కలవపూడి, పెదలంక, మాలవానితిప్ప, మాట్లం, దొంగపింది, లక్ష్మీపురం, పల్లెపాలెం, పండితడిక, పాతపాడు, చినగొల్లపాలెం, పేరుపాలెం తదితర గ్రామాలు పరివాహంలో ఉన్నాయి. బుడమేరు వరద నీరు కొల్లేరు ద్వారా అధిక స్థాయిలో వస్తే ఈ గ్రామాలన్నీ వరద బారిన పడే అవకాశాలున్నాయి. ఈ పరిస్థితిలో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నీటి ప్రవాహ సామర్థ్యాన్ని అధికారులు ముందు చూపుతో అంచనావేసి తగు జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. 1986 వరదలు అనంతరం ఉప్పుటేరుకి ఇరువైపులా పెద్ద ఎత్తున కరకట్ట నిర్మించారు. ఆక్రమణదారులు ఈ కరకట్టను పూర్తిగా ధ్వంసం చేసి ఉప్పుటేరు అంచుల వరకు చేపల, రొయ్యల చెరువులను నిర్మించేసుకున్నారు. ఇప్పటి పరిస్థితిలో బుడమేరు వరద నీరు మొత్తం ఉప్పుటేరులోకి వచ్చిందంటే ఖచ్చితంగా ఆ నీరు ఉప్పుటేరు పరివాహ గ్రామాలను ముంచెత్తడం కాయంగా కనిపిస్తుంది. దీని ముందుగానే అంచనా వేసి తగు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

వరద బాధితులకు సీపీ చేయూత

విశాలాంధ్ర-విజయవాడ (క్రైమ్): వరద బాధితులకు ఎన్టీఆర్‌జిల్లా పోలీస్ కమిషనర్ ఎస్వీ.రాజశేఖరబాబు చేయూతనందించారు. బాధితులకు తన వంతు సాయంగా హైదరబాద్‌లోని ఐటీ కంపెనీతో మాట్లాడి వారి సహకారం తో బ్లాంకెట్స్, బట్టలు, మాస్కులు పంపిణీ చేశారు. విజయవాడ అజిత్‌సింగ్ నగర్, న్యూరాజరాజేశ్వరిపేట వరద బాధితులకు పోలీస్ సేవాదళ్ సిబ్బందితో పంపిణీ చేశారు. సీపీ రాజశేఖరబాబు మాట్లాడుతూ గత ఎనిమిది రోజులుగా నగరంలో నీట మునిగిన ప్రాంతాల్లో బాధితులకు రాష్ట్ర ప్రభుత్వం నుండి వివిధ రకాలుగా సహాయ సహకారాలు అందించడం జరుగుతోందని అన్నారు.

వరద బాధితులకు ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్ పూర్వ విద్యార్థుల చేయూత

విశాలాంధ్ర-విజయవాడ (వన్‌టౌన్): విజయవాడ వన్‌టౌన్‌లోని శ్రీ కన్యకా పరమేశ్వరి విస్సం శెట్టి వెంకటరత్నం హిందూ హై స్కూల్ (ఎస్‌కేపీవీవీ హిందూ హైస్కూల్) లో చదువుకున్న 1985-86 బ్యాచ్ పూర్వపు విద్యార్థులు వరద బాధితులకు చేయూతనందించారు. అందరూ కలిసి వరద బాధితుల సహాయార్థం స్వచ్ఛందంగా వారి స్నేహితుల వద్ద నుండి విరాళాలు వసూలు చేసి తద్వారా ఉన్న నగదు సమీకరణ ప్రకారము ఇప్పటివరకు మూడు దశలుగా సాయం అందించారు. మొదటి దశలో అజిత్‌సింగ్‌నగర్, జ్యోజీనగర్, ప్రకాష్ నగర్ వరద బాధితులకు ఫుడ్ ప్యాకెట్లు, వాటర్ ప్యాకెట్లు, వాటర్ బాటిల్స్ అందించారు. రెండవ దశలో వాటర్ బాటిల్స్, టెట్రా పాలు ప్యాకెట్లు, కూరగాయలు, బిస్కెట్స్, మందులు, వైఎస్సార్ కాలనీలో పంపిణీ చేశారు. మూడో దశలో జోజీ నగర్, ఊర్మిళానగర్ వాసులకు వాటర్ బాటిల్స్, కూరగాయలు అందించారు.

ముంపు ప్రాంతాల్లో నీరు తొలగింపు

విశాలాంధ్ర-కూచిపూడి : గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు అంతర్గత రహదారులపై, ప్రధాన రహదారులపై పల్లపుప్రాంతాలు జలమయమవటంతో ఆయా పంచాయతీలు ఇంజనులతో నీరు తొలగించే కార్యక్రమంలో నిమగ్నమైనారు. అలాగే పారి సూచన నివారణకు బ్లీచింగ్ , సున్నం, దోమల నిర్మూలనకై ఎబిట్ మందును చల్లించే కార్యక్రమాల్లో ఉన్నారు. భాగంగానే కోసూరు, నిడుమోలు, మంత్రి పాలెం గ్రామాల కార్యదర్శిగా కొనసాగుతున్న ఎం ఎన్ ఎస్ మూర్తి పర్యవేక్షణలో నీరు తొలగింపు చర్యలు ఆయిల్ ఇంజన్ ద్వారా చేపట్టారు. నిడుమోలులో ఎస్ టి కాలనీలో ముంపు పాలైన రహదారులపై నీరును పూర్తిగా తొలగించినట్లు ఆయన వివరించారు

ఇండక్షన్ ప్రోగ్రాం

విశాలాంధ్ర-కూచిపూడి : మొవ్వ వి ఎస్ ఆర్.ప్రభుత్వ డిగ్రీ మరియు పీజీ కళాశాలలో డిపార్ట్మెంట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ ఆధ్వర్యంలో కళాశాల పొలిటికల్ సైన్స్ లెక్చరర్ డాక్టర్ ఎం సుందరరావు అధ్యక్షతన సోమవారం ఇండక్షన్ ప్రోగ్రాం నిర్వహించారు ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ మొదటి సంవత్సరం విద్యార్థులు సమాజంలో ఉన్నటువంటి సామాజిక బాధ్యతలు పట్ల అవగాహన కలిగి ఉండాలని సమాజానికి సేవ చేసే విషయంలో సామాజిక స్పృహ దృక్పథం అలవర్చుకోవాలని సూచించారు. కళాశాల ఎకనామిక్స్ లెక్చరర్ జి సురేష్ బాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి కూడా విద్యతోపాటు సమాజ సేవ కొరకు పాటుపడటానికి ఆలోచన చేయాలని సూచించారు

మొవ్వలో రేణుకమ్మకు సారె

విశాలాంధ్ర-కూచిపూడి : మండల కేంద్రమైన మొవ్వలో ఈడే వారి గ్రామదేవత రేణుకమ్మతల్లికిపసుపు కుంకుమలతో కూడిన సారెను సమర్పించారు. జిల్లాలోపలుప్రాంతాలలోగల ఈడేవారి కుటుంబ సభ్యులు, ఆడపడుచులు కలిసి పసుపు, కుంకుమ, చీరలు, పూలు, పండ్లు, చలిమిడి, స్వీట్లు తదితరాలను ఊరేగింపుగాతీసుకొచ్చిఅందజేసి ప్రత్యేక పూజలు పాల్గొన్నారు.

సహాయక చర్యల్లో 'రోటరీ మిడ్ టౌన్'

విశాలాంధ్ర-విజయవాడ లబ్బీపేట: విజయవాడ. నగరాన్ని చుట్టుముట్టిన వరద ప్రజలను అంతలాకుతలం చేస్తోంది. వారం రోజులుగా ఎనిమిది అడుగుల నీటిలో, తిండి లేక, తాగడానికి నీళ్లు లేక, విద్యుత్ కూడా లేక చిమ్మ చీకటిలో గడుపుతున్న ప్రజలకు ప్రభుత్వం శక్తి వంచన లేకుండా ఎంతో సహాయ చర్యలు చేపడుతోంది. అయినా పూర్తిగా ప్రజలకు చాలడం లేదు. ఈ నేపథ్యంలో ఎన్నో స్వచ్ఛంద సంస్థలు ప్రభుత్వానికి తోడుగా మేమున్నా మంటూ ముందుకొచ్చాయి. అందులో రోటరీ క్లబ్ మిడ్ టౌన్ విజయవాడ విజృంభించింది. పడవలతోను, ట్రాక్టర్ల తోనూ సభ్యులైన యువకుల అండతో ఎంతో సేవ చేస్తోంది. రామలింగేశ్వర నగర్, క్రిష్ణలంక,సింగ్ నగర్, పాయకా పురం, కబేలా సెంటర్, భవాని పురం, స్వాతి రోడ్ , ఎక్కడ అవసరమైతే అక్కడ యుద్ధ ప్రాతిపదికన సేవలందిస్తున్నారు. సేవలు ఇంకా కొనసాగిస్తున్నప్పటికీ, ఇప్పటికే సుమారు 10 లక్షల రూపాయల మేర సహాయ చర్యలకు ఖర్చు చేశారు. రెండు రోజుల పాటు ఆహారాన్ని అందజేశారు. రెండు రోజులు పాల ప్యాకెట్లు అందించారు. అలాగే, రోగాలు ప్రబలకుండా బ్లీచింగ్ పొడి చల్లారు. చలిలో వణికి పోతున్నవారికి దుప్పట్లు పంచారు. వీటన్నిటితో పాటు అవసరాల మేరకు మంచి నీరు అందించారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగిస్తూనే ఉన్నారు. ఈ సహాయక చర్యల్లో, మిడ్ టౌన్ అధ్యక్షులు గుడిపాటి కిషోర్, కార్యదర్శి సుందర్ రెడ్డి, సలహా దారులు యడ్ల పార్ధ సారధి, వై. స్వరూప, క్రిష్, తొండెపు ఉదయ్, కోనేరు మధు, చందోలు సతీష్, యువ కిరణ్, జీవన్, సంపత్ కుమార్, ఆలపాటి కిరణ్ ఇంకా ఎంతోమంది అంకిత భావంతో పనిచేస్తున్నారు.